

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1 హన్మకొండ,వరంగల్, జయశంకర్, ములుగు, జనగామ, మహబూబాబాద్
బుధవారం 22 ఫిబ్రవరి 2023





ఫిట్స్‌తో పొలం వద్దే రైతు మృతి

నవతెలంగాణ-గోవిందరావుపేట



మండలంలోని పస్రా గ్రామంలో మంగళవారం గిరి సాంబయ్య(50) తన వ్యవసాయ పొలం వద్ద పనిచేస్తుండగా ఫిట్స్ వచ్చి నీటిలో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా సాంబయ్య మృతి చెంది ఉండడంతో గొల్లుమన్నారు. ఫిట్స్ వచ్చిన క్రమంలో సమీపంలో ఎవరూ లేకపోవడం, నీటి ప్రాంతం కావడంతో శ్వాస ఆడక మృతి చెంది ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ -జనగామ డెస్క్

చిల్పూర్ మండలకేంద్రంలోని శ్రీ బుగులు వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే డా తాటికొండ రాజయ్య అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుతో కలిసి బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 26నుంచి మార్చి 5వరకు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డి, ఎంపిపి బొమ్మిశెట్టి సరితా బాలరాజు, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, పీఆర్‌టీయూ పసునూరి మహేందర్ రెడ్డి, ఈఓ వెంకట్రావ్, ధర్మకర్తల మండలి సభ్యులు రవీందర్ రెడ్డి, వీరా రెడ్డి, సంపత్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

- రామన్న రాకతో జిల్లా మరింత అభివృద్ధి
- 50వేల మందితో బహిరంగ సభ నిర్వహణ : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి



ఈనెల 23న మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని, రామన్న రాకతో రానున్న రోజుల్లో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని, 50 వేలమందితో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా జిల్లా కేంద్రానికి మెడికల్ కాలేజీ తీసుకొచ్చామని, హామీలు ఇవ్వకుండా కూడా నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని అన్నారు. భూపాలపల్లి పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి మంత్రి కేటీఆర్ హామీ ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ తోపాటు పంచాయితీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి హాజరవుతారన్నారని తెలిపారు. వారు వచ్చి ఇచ్చే వరాలతో భూపాలపల్లి అభివృద్ధిలో మరింత పరుగులు పెడుతుందన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో జిల్లాలో విలేకరులకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి కేటీఆర్ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా గణపురం మండల కేంద్రానికి చేరుకొని ఘనపురంలో తహసీల్దార్ కార్యాలయం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తారన్నారన్నారు. భూపాలపల్లి మంజూర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన 1000 సింగరేణి క్వార్టర్స్ ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌తోపాటు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభించి వేశాలపల్లిలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు. దివ్యాంగుల కోసం నిర్మించిన కమ్యూనిటీ భవనం ప్రారంభిస్తారని, మున్సిపాలిటీ మినీ స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన, స్ట్రీట్ వెండర్స్ ఫ్రూట్ మార్కెట్ ప్రారంభం, గ్రంథాలయం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. భోజన విరామం అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్ధన్, జిల్లా నాయకులు కళ్లెపు రఘుపతిరావు, పైడిపల్లి రమేష్‌కుమార్ రెడ్డితోపాటు జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- మంత్రుల పర్యటన కోసం రెండు హెలీప్యాడ్‌లు సన్నద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్ర ఐటీశాఖ మంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధింత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో మంత్రుల పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సంబంధిత ఇన్‌చార్జి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 23న మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో మంత్రులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతి కార్యక్రమం వద్ద నియమించిన అధికారులు నిర్దేశిత పనులు పూర్తి స్థాయిలో పకడ్బందీగా చేయాలని సూచించారు. రెండు ప్రదేశాలలో ఘన్‌పూర్ మండలం, భాస్కర్ గడ్డ వద్ద నిబంధనల పాటిస్తూ హెలిపాడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఘన్‌పూర్ మండల నూతన తహసిల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘన్ పూర్ రెవెన్యూ డివిజన్ అధికారి, తహసిల్దార్ పర్యవేక్షించాలన్నారు. నూతన తహసిల్దార్ కార్యాలయం, ఆకర్షణీయంగా అలంకరించాలన్నారు. నూతన బీసీ రెసిడెన్షియల్ హాస్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీసి, ఎస్సీ సంక్షేమ అధికారులు, ఈఈ పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. సింగరేణి కాలనీలో నిర్మించిన దాదాపు 1000 ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మొక్కలు నాటుతారని, సింగరేణి కాలనీ పరిధిలో 4 వేల మొక్కలు నాటేందుకు వీలుగా గుంతల తవ్వకం పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. సింగరేణి కాలనీ వద్ద సింగరేణి చరిత్ర, సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లాలోని నూతన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ప్రారంభోత్సవం జరుగుతుందని, అక్కడే మంత్రి కేటిఆర్ భోజన విరామం తీసుకుంటారన్నారు. ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు, మంత్రుల సిబ్బంది భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ లో టీవి, ఫర్నిచర్, ఆట వస్తువులు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం భూపాలపల్లి లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం వద్ద ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. సమీకృత మార్కెట్ సముదాయం స్ట్రీట్ వెన్డర్లా ప్రత్యేక జోన్, మినీ స్టేడియం ప్రారంభం, లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన ఏర్పాట్లను ఈడిఎస్సీ కార్పొరేషన్ ఎంపీడీవో పంచాయతీరాజ్ డిఇ మున్సిపాలిటీ అధికారులు చేయాలన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభ కార్యక్రమం పకడ్బందీగా జరగాలన్నారు. స్టేజీ పై ప్రోటోకాల్ నిబంధనలు పాటించాలని, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు ఆమోదించిన వారిని మాత్రమే స్టేజి పై అనుమతించాలని సూచించారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు వివరించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో అమలు చేస్తున్న కంటి వెలుగు మొదలగు అభివృద్ధి కార్యక్ర మాల బ్యానర్లు, ఫొటో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జీఓ 58,76 కింద ఆమోదించిన దరఖాస్తుల్లో కొంతమందికి పట్టాల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంబేద్కర్ స్టేడియం లో నిర్వహించే సభలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ సమస్య ఉత్పన్నం కాకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టి.ఎస్.దివాకర, ఆర్.డి.ఓ. శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'తోట'పై దాడి కేసులో నలుగురి అరెస్ట్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోట పవన్‌పై సోమవారం రాత్రి జరిగిన దాడి కేసులో 4గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు హన్మకొండ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌జీ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నలుగురు నిందితులను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. సోమవారం రాత్రి రేవంత్‌రెడ్డి పాదయాత్ర ముగిసిన అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోట పవన్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో చెక్క సుమన్, రావుల కొలను నరేందర్, గుడికందుల వినోద్‌కుమార్, సిటిమోర్ సునార్ కృష్ణలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడి కేసులో సంబంధమున్న మిగతా నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు.



నాణ్యమైన భోజనం అందించాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్య ప్రకాష్

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గుగులోతు సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో నాసరికమైన భోజనం పెడుతూన్నారని, విద్యార్థులు తినలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. దీనివల్ల విద్యార్థులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొంతమంది ఇంటినుండే బాక్స్ తెచ్చుకుంటున్నారని అన్నారు.. తక్షణమే ఉన్నత విద్యాధికారులు స్పందించి నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మెస్ చార్జీలు పెంచాలని, ఖాళీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బానోతు సింహాద్రి, పట్టణ నాయకులు రాజేష్, ఉపేందర్, నవీన్, లక్ష్మణ్, కళ్యాణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్ఘాతంతో తండ్రీకొడుకులు మృతి

నవతెలంగాణ - చిన్నగూడూరు

విద్యుత్ఘాతంతో తండ్రి కొడుకులు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని ఉగ్గంపల్లి శివారు దుమ్డా తండాలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఆంగోత్ సీవీ(65) ఆంగోత్ కిరణ్ (36) జుజ్జురి వెంకన్న మూడు ఎకరాల భూమిని కౌవులు తీసుకొని మొక్కజొన్న పంటను వేశారు. చేతి కందిన పంటను కోతుల బారి నుండి కాపాడుకునేందుకు చేను చుట్టూ జే వైరు అమర్చి విద్యుత్ సరఫరా చేశారు. రోజూ మాదిరిగానే తెల్లవారుజామున చేను దగ్గరికి కోతుల కాపుల కోసం వెళ్లారు. ప్రమాదవశాత్తు కొడుకు కిరణ్ విద్యుత్ వైరు తగలడంతో కొడుకును రక్షించే క్రమంలో తండ్రి కూడా విద్యుత్ఘాతంతో ఇద్దరు అక్కడికక్కడే మతి చెందారని తెలిపారు. తండ్రి కొడుకులు ఎంతసేపటికైనా ఇంటికి రాకపో యేసరికి కుటుంబ సభ్యులు, బంధువులు చేను దగ్గరికి వెళ్లి చూసేసరికి విగాత జీవులుగా పడి ఉన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోయేసరికి తండవా సులంతా శోకసముద్రంలో మునిగిపోయారు. మృతుడు కిరణ్‌కు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తప్పుడు సంకేతాలను ప్రజలంతా వ్యతిరేకించాలి

- రెడ్ బుక్ డేలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్



నవతెలంగాణ-గోవిందరావుపేట

దేశంలో విప్లవోద్యమంలో పాల్గొన్న కమ్యూనిస్టు నాయకులను మతోన్మాద శక్తులు మతోన్మాద నాయకులుగా చిత్రీకరిస్తున్నారని, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్ వంటి వారిని తమ భావాలకు ఆదర్శప్రాయులని ప్రజలకు తప్పుడు సంకేతం ఇస్తున్నారని, దీనిని ప్రజలంతా వ్యతిరేకించాలని రెడ్ బుక్ డేలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. మండలంలోని పస్రా గ్రామంలో రెడ్ బుక్ డేని గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోతినెని సుదర్శన్‌రావు హాజరై మాట్లాడుతూ... రెడ్ బుక్ డే ప్రపంచవ్యాప్తంగా వామపక్షవాదులు కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన బుక్కులు చదవాలని నిర్ణయించారన్నారు. ప్రపంచంలో అత్యధికంగా చదువుతున్న బుక్కు కారల్ మార్క్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక అని అన్నారు. భగత్ సింగ్ విప్లవోద్యమంలో దేశం కోసం ప్రాణాలర్పించిన మహా వీరుడని కొనియాడారు. భగత్ సింగ్ అతని సహచరులు ఆజాద్ చంద్రశేఖర్, శివవర్మ సుఖదేవ్ వంటి వారు కమ్యూనిస్టు పార్టీ భావజాలంతో ముందుకు వెళ్లారని గుర్తు చేశారు. వారిని ఆదర్శంగా తీసుకొని దేశంలో విప్లవ ఉద్యమాలను జయప్రదం చేయాలని పిలుపునివ్వారు. జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, బీరెడ్డి సాంబశివ, పొదిలి చిట్టిబాబు అంబాల పోషాలు, కడారి నాగరాజు, జిమ్మా జ్యోతి కడారి రాజేశ్వరి, సామ చంద్రారెడ్డి, ఉమ్మడి ఉపేంద్ర చారి, పందాల శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ప్రణాళికే రెడ్ బుక్ డే : సీపీఐ(ఎం)

కాజీపేట : కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రజల్లోకి వెళ్లే ప్రణాళికే రెడ్ బుక్ డే అని డీవైఎఫ్ఐ హన్మకొండ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, సీపీఐ(ఎం) జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి అన్నారు. బుధవారం 49వ డివిజన్ పరిధి ప్రగతినగర్ లోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ రెడ్ బుక్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిలుగా నోముల కిషోర్, సీపీఐ(ఎం) జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్ పాల్గొని మాట్లాడారు. రెడ్ బుక్ డే సందర్భంగా కమ్యూనిస్టు మ్యానిఫెస్టో 175 సంవత్సరాల క్రితం 1848 ఫిబ్రవరి 21 న పెట్టుబడిదారీ వ్యవస్థ నగ్నస్వరూపాన్ని బట్టబయలు చేసిన పుస్తకం అన్నారు. ప్రపంచ శ్రామిక వర్గానికి కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ ఇచ్చిన సిద్ధాంతం ఆయుధం అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బంధనాల నుండి శ్రామిక వర్గానికి చూపిన విముక్తి మార్గం, నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక దిక్సూచి కమ్యూనిస్టు మ్యానిఫెస్టో అన్నారు. మ్యానిఫెస్టో ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రెడ్ బుక్ డే ను నిర్వహించినట్టు తెలిపారు. మిత్రుడు శివవర్మ రచించిన భారత ఉద్యమ కెరటం భాగత్ సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు చిట్యాల విజయ్ కుమార్, చిలుక జంపన్న, సీపీఐ (ఎం) కాజీపేట కార్యదర్శి తొట్టె మల్లేశం, దూడపాక రాజేందర్, వెంకటేశ్వర్లు, సాంబయ్య, యువన్, అనూష, శ్రావణి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు..

మతోన్మాదాన్ని ఎదుర్కోగలం

ఎస్టీవోస్ కాలనీ : సిపిఎం హనుమకొండ మండల వెస్ట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రోజు ప్రపంచవ్యాప్తంగా జరిగే రెడ్ బుక్ డే సందర్భంగా సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లాకార్యాలయంలో





పార్టీ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి పాల్గొని భారత భగత్ సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 21న ప్రతి సంవత్సరం రెడ్ బుక్ డే గా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, యువకులు విద్యార్థులు మహిళలు భగత్ సింగ్‌ను అధ్యయనం దోపిడి రహిత, సమసమాజం కోసం మరో స్వతంత్ర పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం భగత్ సింగ్ జీవిత చరిత్ర పై జిల్లా కమిటీ సభ్యులు చుక్కయ్య వివరించారు. జిల్లా కమిటీ సభ్యులు టి. ఉప్పలయ్య ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా హనుమకొండ మండల కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, గొడుగు వెంకట్, కాడబోయిన లింగయ్య, మండల కమిటీ సభ్యులు వల్లెపు రాజు, వల్లపు లింగమూర్తి, ప్రజాసంఘాల నాయకులు ఉమా, రమాదేవి, కొమురెల్లి, విజయేందర్, ప్రసన్న, సుధాకర్, సమ్మయ్య, మురళి, సరిత, విజయ, కవిత, శ్రీమాతా ,సారంగపాణి పాల్గొన్నారు..

లింగాల ఏజెన్సీలో ఐటిడీఏ పీఓ అంకిత్ పర్యటన

నవతెలంగాణ -తాడ్వాయి

మండలంలోని దట్టమైన అటవీప్రాంతం లింగాల, బంధాల ఏజెన్సీ గ్రామాలలో ఏటూర్ నాగారం ఐటీడీఏ పీవో అంకిత్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కొడిశెల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో మరమ్మతు పనులు, సోలార్ వాటర్ హీటర్ పనిచేయడం, మిషన్ భగీరథ వాటర్ సరఫరా, వంటగది, టాయిలెట్ నిర్వహణ తదితర అంశాలపై పాఠశాల హెచ్ఎం సుతారి రమేష్ తో చర్చించారు. పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థులు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండాలని అందరు విద్యార్థులు 10/10 జిపిఏ గ్రేట్ సాధించాలని దానికి తగ్గ ప్రణాళికలు ఏర్పాటు చేసి కృషి చేయాలని సూచించారు. అంతరం విద్యార్థులకు



స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. అనంతరం పోచాపూర్ లోని మినీ గురుకులం పాఠశాలను తనిఖీ నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు గాను 126 మంది విద్యార్థులు అందుబాటులో ఉండగా ప్రధాన ఉపాధ్యాయురాలు పై పిఓ అంకిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినీ గురుకులం పాఠశాల ఉపాధ్యాయులు సరిగా సమయపాలన పాటించడం లేదని, విద్యార్థులను హాజరు శాతం కూడా సరిగా లేదని మండిపడ్డారు. విద్యార్థులకు యూనిఫాంలు, స్కూల్ బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అనంతరం కొడిశల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనకి నిర్వహించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, సెల్ కౌంటర్ పనితీరు, మందుల గది, ఉప కేంద్రాలను పరిశీలించారు. స్టాఫ్ నర్సులు, వైద్యులు సమయపాలన పాటించాలని, ఆదివాసులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలో క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాలలో విధులు నిర్వహించే వివిధ శాఖల ఉద్యోగులు సమయపాలన పాటించి, మంచి సేవలు అందించాలని ఐటీడీఏ పీఓ కోరారు. విధులకు సక్రమంగా హాజరు కాని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏసీబీ వలలో ఎంపీఎస్ఓ

- మరణ ధ్రువీకరణ పత్రానికి రూ.2000 లంచం తీసుకుంటుండగా పట్టుబడిన వైనం

నవతెలంగాణ-భూపాలపల్లి

మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చేందుకుగాను ఎంపీఎస్ఓ 2000 లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కాడు. ఈ ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ అవరణ లో జరిగింది ఏసీబీ ఇంచార్జ్ డిఎస్పి సుదర్శన్ వరంగల్ రేంజ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రేగొండ మండల ఎంపీఎస్ఓగా రఘుపతి విధులు నిర్వహిస్తున్నాడు. ఇదే మండల కేంద్రానికి చెందిన వడ్లకొండ మల్లికార్జున అనే వ్యక్తి గత కొన్నాళ్ల కిందట తన అత్తమ్మ అయిన ఓడేటి కాంతమ్మ వద్ద ఒక ఇంటిని కొనుగోలు చేశాడు. గత కొంతకాలం కిందటే కాంతమ్మ చనిపోయింది ప్రస్తుతం ఆ ఇంటిని ప్రైవేట్ బ్యాంకుకు కిరాయికి ఇచ్చేందుకు గాను మల్లికార్జున్ బ్యాంక్ అధికారులతో ఒప్పందం చేసుకు న్నాడు. ఇదే క్రమంలో బ్యాంక్ అధికారులు కాంతమ్మ మరణ ధ్రువీకరణ పత్రం కావాలని అడిగారు. ఆ పత్రం కోసమై ఆన్లైన్లో మీసేవ ద్వారా మల్లికార్జున్ దరఖాస్తు చేసుకున్నా డు. సర్టిఫికెట్ ఇప్పించేందుకు గాను ఎంపీఎస్ఓ రఘుపతిని పలుమార్లు కలిశాడు. రఘుపతి పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. చివరకు తనకు రూ.30000 ఇవ్వాలని డి మాండ్ చేయగా అంత ఇచ్చుకోలేనని మల్లికార్జున్ చెప్పి రూ. 20000 ఇస్తానని అంగీకరించాడు. అయి నప్పటికీ ప్రక్రియ పూర్తి చేయకుండా రఘుపతి కాలయాపన చేస్తూ వచ్చాడు. ఒప్పందం ప్రకారం ముందుగా తనకు 2000 ఇస్తేనే పనిచేస్తానని రఘు పతి చెప్పడంతో మల్లికార్జున్ విసుగుచెంది ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధి.కారులు రంగంలోకి దిగి పక్కా ప్రణాళికతో పథకం రచించి ఎంపిఎస్ఓ రఘుపతిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయానికి తీసుకువచ్చి సుమారు రెండు గంటల పాటు విచారణ కొనసాగించారు. మొత్తానికి ఈ సంఘటన జిల్లా కేంద్రంలో చర్చ నీయంగా మారింది.



శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి

- జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్

నవతెలంగాణ - ములుగు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అన్నారు. కరోనా పరిస్థితి దృష్ట్యా విద్యా వ్యవస్థలో డిజిటల్ బోధన జరుగుతున్న తరుణంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎఫ్ పిఎస్టి ములుగు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు శిరుప సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి విద్యార్థులు పోటీ పరీక్షలు కూడా డిజిటల్ విధానంలో అలవర్చుకొని 100 శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలనానరు. మొబైల్ ఫోన్లను మంచి విద్యను పొందడానికి ఉపయోగించుకోవాలని, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలన్నీ కూడా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటున్నాయని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. ములుగు జిల్లా అధ్యక్షులు శిరుప సతీష్ కుమార్ మాట్లాడుతూ 8, 9వ తరగతి విద్యార్థులకు ఆన్లైన్ పరీక్ష విధానం అవగాహన కావడం కోసం, భౌతిక శాస్త్రంలో సులభ విధానాల అవలంభనకు అవగాహన పరిశోధన ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం కృషి చేస్తుందని అన్నారు. జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన పస్రా ఉన్నత పాఠశాలకు చెందిన అభినవ్, ద్వితీయ స్థానంలో నిలిచిన వెంకటాపూర్ ఉన్నత పాఠశాల చెందిన శివశంకర్, తతీయ స్థానంలో నిలిచిన రాజుపేట ఉన్నత పాఠశాల చెందిన అర్జున్ జ్ఞానదీపును, నిర్వాహకులను అభినందించారు. ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవరపు శ్రీధర్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బుర్ర రజిత, ఆనంద్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

తునికాకు బోనస్ చెల్లించాలి

- అటవీశాఖ అధికారులకు ప్రజాసంఘాల వినతి

నవతెలంగాణ-వెంకటాపురం


వాజేడు, వెంకటాపురం మండలాల్లో 2016-2022 తునికాకు సేకరించిన కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ సొమ్ములు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ అధికారకి వినతి పత్రాన్ని అందజేశారు. 2016-2022 వరకు తునికాకు సేకరించిన కార్మికులకు చిల్లించాల్సిన బోనస్ వెంటనే చెల్లించాలని రాష్ట్ర అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2023 ఫిబ్రవరి చివారికల్ల తునికాకు సేకరించిన కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ బోనస్ చెల్లింపులపై అధికారులు పట్టించుకో లేదని, వెంటనే తునికాకు బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ జిల్లా నాయకులు దబ్బకట్ల లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గ్యానం వాసు, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.


వివాహేతర సంబంధం.. పట్టించిన సెల్‌ఫోన్

సహో ఉపాధ్యాయులు ఇద్దరికి దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత

నవతెలంగాణ-మంగపేట

సభ్య సమాజం సిగ్గుపడేలా ఇద్దరు ఉపాధ్యాయులు కొంత కాలంగా సాగిస్తున్న అక్రమ సహజీవనాన్ని మహిళా ఉపాధ్యాయురాలు సెల్‌ఫోను ద్వారా ఆమె భర్త పులసం సాంబశివరావు పట్టుకుని ఇద్దరిని కట్టేసి దేహశుద్ధి చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మహిళా ఉపాధ్యాయురాలు భర్త సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫిజికల్ సైన్సు, బయోసైన్సు స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న కుక్కల నాగేందర్, ఈసం లావణ్య కొంత కాలంగా ప్రేమ వ్యవహారం నడిపిస్తూ అక్రమసంబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఉద్యోగరిత్యా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న లావణ్య భర్త సాంబయ్య విషయాన్ని తెలుసుకుని 2022 డిసెంబర్ లో పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయురాలుకు పిర్యాదు చేయగా ఇద్దరిని హెచ్చరించారు. ఇదే సందర్భంలో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేయడంతో పాటు అధికారులు లావణ్యను 2023 జనవరిలో మంగపేట నుండి కొత్త బెస్తగూడెం పాఠశాలకు డిప్యూటేషన్ పై పంపించారు. అయినా తీరు మార్చుకోకపోగా ఇద్దరు అక్రమ సంబందాన్ని కొనసాగించారు. ఫిబ్రవరి 18న శివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడకు బందోబస్తు విధులకు హాజరై సెలవు లభించడంతో లగేజి నర్సంపేటలో పెట్టి బార్య కూతురును చూడాలని మంగపేటకు సాంబయ్య వచ్చాడు. గత సోమవారం రాత్రి తన సెల్ ఫోనులో సిగ్నల్ లేకపోవడంతో భార్య లావణ్య ఫోన్ వాట్సప్ చూస్తున్న క్రమంలో అలవాటు ప్రకారం ఫోను చేసిన నాగేందర్ భర్త ఉన్న విషయాన్ని గ్రహించక తను వస్తున్నానని తలుపు తీసి ఉంచాలని చెప్పి ఫోను పెట్టేశాడు. దీంత అప్రమత్తమైన సాంబయ్య నిద్రలో ఉన్న భార్యకు చెప్పకుండా చివరి గదిని లాక్ చేసి ముందు తలుపు తీసి ఉంచి బాత్రూమ్‌లో దాక్కున్నాడు. అనుకున్నట్లుగానే తలుపు తీసి ఉండడంతో నాగేందర్ లోపలికి వెళ్లగానే సాంబయ్య బయటకు వచ్చి ముందు తలుపు లాక్ చేసి కొత్తగూడ మండలంలోని బందువులకు, స్థానిక ఆదివాసీ గిరిజన ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చాడు. ఇద్దరి అక్రమ సంబందాన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సాంబయ్య ఉపాధ్యాయుడు కుక్కల నాగేందర్, లావణ్యలకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించాడు. నాగేందర్ గతంలో పలువురి మహిళలతో అక్రమ సంబంధం కొనసాగిస్తుండడంతో బార్య వెళ్లిపోయినట్లు తోటి ఉద్యాయులు తెలిపారు.





రామప్ప లక్నవరంను విద్యార్థుల సందర్శన

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ ఉమ్మడి మండలం బూర్గుగూడెం ఎంపీపీఎస్ స్కూల్ విద్యార్థులు విహార యాత్రలో భాగంగా మంగళవారం రామప్ప లక్నవరంను సందర్శించారు. ఇలాంటి వినోద యాత్రల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు మాన సిక వికాసం కల్గుతుందని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలోహెచ్ఎం రవి, బీఆర్ఎస్ నాయకులు మడే సత్యనారాయణ, విద్యార్థులయతల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంబాపూర్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

నవతెలంగాణ -తాడ్వాయి



మండలంలోని పంబాపూర్ గ్రామంలో సర్పంచ్ ఎల్లబోయిన యూన్సీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన పారిశుద్ధ్య పనులు మంగళవారం ముమ్మరంగా నిర్వహించారు. గత శనివారం మహాశివరాత్రి సందర్భంగా ఏర్పడ్డ చెత్తాచెదారాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది, కారోబర్‌లు తొలగిస్తున్నారు. డెంగ్యూ లాంటి విష జ్వరాలు ప్రబలకుండా గ్రామంలో బ్లీచింగ్‌చేయడంతోపాటు రోడ్లకిరువైపులా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి డంపింగ్ యార్డులకు తరలించారు.



సంత్ సేవాలాల్ గొప్ప సంఘసంస్కర్త

- ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క

నవతెలంగాణ-గోవిందరావుపేట

సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘసంస్కర్త అని ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాకతీయ కమ్మ సేవా సంఘంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ 284వ జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే సీతక్క హాజరై మాట్లాడారు. సమాజంలో ఉన్న అవినీతిని అహింసా యుతంగా ఎదుర్కొంటూ విలువలను పాటించిన మహనీయుడని కొనియాడారు. సమాజంలో దురాచారాలను సామరస్యంగా, శాంతియుతంగా ఎదుర్కొని మానవతా వ్యక్తిగా నిలిచిన సేవాలాల్‌ను స్మరించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు బానోత్ రవిచందర్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సారయ్య, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెం శ్రీకాంత్, పాలడుగు వెంకటకష్ణ, జెట్టి సోమయ్య, సర్పంచ్ లావుడియ లక్ష్మీ- జోగ నాయక్, సీనియర్ నాయకులు పాశం మాధవరెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి : బీఆర్ఎస్

- ఎమ్మెల్యే గండ్ర, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

మంత్రి కల్వకుంట్ల తారక రామారావు బహిరంగ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి, వరంగల్ జడ్పీ చైర్పర్సన్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అమ్మ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మండల పార్టీ అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సన్నాహక స మావేశంలో వారు మాట్లాడారు.ఈ నెల23న నియోజకవర్గ పరిధిలో పలు అభివద్ధి పనులకు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంత్రి కేటీఆర్ వస్తున్నాడని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుండి బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చిట్యాల : ఈ నెల 23న భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగే ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ భారీ భహిరంగ సభను విజయ వంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జెడ్పీటీసీ గొర్రె



సాగర్ ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జిలు కొలుగురి రాజేశ్వర్‌రావు, దామోదర్‌గౌడ్ మండల అధ్యక్షుడు ఆరపెల్లి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్‌రెడ్డి ముమ్మర ప్రచారం చేశారు. మండలం లోని ముచినిపర్తి చల్లగరిగ, జుకల్, చిట్యాల, నవాబుపెట్, కైలాపుర్, తీర్మలపూర్, గుంటూరు పల్లె, ఏలేటి రామయ్య పల్లి, తదితర గ్రామాల్లో పర్యటించారు. సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. అయా గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఎంపీటీసిలు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి : సొసైటీ చైర్మన్

గణపురం : ఈ నెల 23 న గణపురం భూపాలపల్లి లో



పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న మంత్రి కల్వకుంట్ల రామారావు పర్యటనను విజయవంతం చేయాలని సొసైటీ ఛైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో సమావేశమై ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అనంతరం గాంధీనగర్ గ్రామంలోని డైట్ కాలేజీని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం భూపాలపల్లి లో పలు అభివద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు

నాయకులు ప్రజలు సహకరించాలి : ఎస్సై

ఈనెల 23న మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్నందున



బీఆర్ఎస్ నాయకులు, మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై అభినవ్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవం ఉన్నదని, పార్టీ నాయకుల కోసం పార్కింగ్ స్థలం కేటాయించినట్లు తెలిపారు.గాంధీనగర్ నుండి వచ్చే వాహనాలు గణపురం బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేయాలన్నారు. బస్టాండ్ నుండి నడుచుకుంటూ తహసిల్దార్ కార్యాలయానికి రావాలన్నారు. వెళ్తుర్లపల్లే గ్రామం వైపు నుండి వచ్చే వాహనాలు పెట్రోల్ పంపు వద్ద పార్కింగ్ చేయాలన్నారు. ధర్మారావు పేట నుండి వచ్చే వాహనాలు కోటగుళ్ళ వద్ద పార్కింగ్ చేయాలన్నారు. మంత్రికి పర్యటన అయ్యేవరకు పోలీసులకు సహకరించాలన్నారు.



రేవంత్ రెడ్డి పాదయాత్ర విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు

నవతెలంగాణ-చిట్యాల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నాయని, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజలకు వివరిస్తూ తలపెట్టిన హాత్ సే హాత్ జూడో యాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్ఛార్జి గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తలపెట్టిన పాదయాత్ర నేడు మండలంలోని చల్లగలిగే, జూకల , తిరుమలాపురం, చిట్యాల, ఏలేటి రామయ్య పల్లె, నవాబుపేటలో కొనసాగుతుందని తెలిపారు. మొదటగా కొడవటంచ గ్రామంలో లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకుంటారన్నారు. అనంతరం పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అనంతరం మొగుళ్ళపల్లి మండలంలో కేంద్రంలో కార్నర్ పాయింట్ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు ముకిరాల మధు, వంశీకష్ణ, మాజీ జెడ్పీటీసీ ఓరం సమ్మయ్య, కిష్టయ్య రమేష్, రాజకొమురు, ఎంపీటీసీ అనిల్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకుడి పై దాడి అమానుషం

నవతెలంగాణ-గణపురం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా యూత్ నాయకుడు తోట పవన్‌పై దాడి అమానుషమని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రేపాక రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తోట పవన్‌పై హత్యాయత్నం ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ గుండాలను అరెస్టు చేసి శిక్షించాలన్నారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కష్ణ వార్డుమెంబర్ మామిళ్ల మల్లేష్‌యాదవ్, సీనియర్ నాయకులు దూడపాక దుర్గయ్య, పూజారి శివశంకర్‌గౌడ్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని ఎంపీడీవో తనిఖీ

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీవో ఎం శంకర్‌నాయక్ మంగళవారం తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌కు పలు సూచనలు చేశారు. లక్ష్యం మేరకు నర్సరీలో మొక్కలు పెంచి సంరక్షించాలన్నారు. ప్రతిరోజు వాచర్ల సహాయముతో రెండుమార్లు నీరు పట్టాలన్నారు. పాలిథీన్ బ్యాగులో విత్తిన గింజలలో ఏవైనా మొలకెత్తకుంటే తిరిగి లోకల్ లో లభ్యమయ్యే గింజలను కొనుగోలు చేసి తిరిగి పాలిథిన్ బ్యాగులలో విత్తాలని సూచించారు. అనంతరం ఎడపల్లి గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కుదురుపల్లి పంచాయతీ కార్యదర్శి ఇందిరా, ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీని వైద్యాధికారి తనిఖీ

నవతెలంగాణ- గోవిందరావుపేట



గోవిందరావుపేట మండలం పరిధి పస్రా పీహెచ్‌సీని, భూసాపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం జిల్లా వైద్య అధికారి అప్పయ్యతో కలిసి కాయకల్ప అసెస్మెంట్ జిల్లా నాణ్యత ప్రమాణాల బృందం డాక్టర్ భాను కుమార్ తనిఖీ చేశారు. అనంతరం బుస్సాపూర్ లోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుకుమార్, మధు, చంద్రకాంత్, జిల్లా కంట్రోల్ నోడల్ ఆఫీసర్ కంటి వైద్య నిపుణులు ప్రవీణ్ రెడ్డి రాజయ్య, హెల్త్ అసిస్టెంట్ జంపయ్య, హెచ్‌వి, ఏఎన్ఎంలు, ఆశాలు, పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొరికిషాల గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మానవ శరీరంలోని అన్ని అవయవాలలో కళ్ళు చాలా ప్రధానమైనవన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు అనే కార్యక్రమం ప్రారంభించి ప్రతి పేద వాడికి ఉచితంగా కంటి పరీక్షలు చేయించి, కావాల్సిన ఉపకరణాలు ఆపరేషన్ వంటివి చేయిస్తున్నారన్నారు. మండలంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించి ఇప్పటికే 5 గ్రామాల్లోని అర్హులందరికీ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి కంటివెలుగు ఆహ్వాన పత్రికలు అందజేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి కంటి వెలుగు శిబిరానికి తరలించి కంటి పరీక్షలు చేయిస్తున్నట్టు చెప్పారు. వైద్య సదుపాయం అందరికీ అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, స్థానిక సర్పంచ్ రాములు, వైద్యాధికారిని నాగరాణి, ఉపసర్పంచ్ మొగిలయ్య,గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-చిట్యాల





అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలుగు ఉపాధ్యాయులు గడ్డం శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పద్య పఠన పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు హెచ్ఎం శ్రీరాం రఘుపతి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పాటలు, కవితలు, ఉపన్యాసాలతో ఆకట్టుకున్న విద్యార్థులందరికీ చిరు కానుకలు అందజేశారు. మాతృ భాషను రక్షించుకుంటేనే సంస్కృతి సంప్రదాయాలు కూడా రక్షింప బడతాయన్నారు. ఉపాధ్యాయులు రాజమౌళి, విజయ, ఉస్మాన్ అలీ, సదయ్య, రాంనారాయణ, సుజాత బుజ్జమ్మ పాల్గొన్నారు.

మల్హర్‌రావు: భూపాలపల్లి జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి, తాడిచెర్ల కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజ్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శాతవాహన యూనివర్సిటీ పరిధి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి అధ్యాపకులు మాట్లాడుతూ ప్రపంచంలోని ఏ భాషలు నేర్చుకోవాలన్న మాతృభాష అవసరం ఆవశ్యకం అని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, ఇన్చారి ప్రవీణ్, అధ్యాపకులు వెంకట్ రెడ్డి, కరుణాకర్, భరత్ రెడ్డి,ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- ఎంపీపీ గొంది వాణిశ్రీ

నవతెలంగాణ -తాడ్వాయి



బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీపీ గొంది వాణిశ్రీ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఇర్ప సునీల్ దొర అధ్యక్షతన నిర్వహించారు. మండల బాలల సంరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. పిల్లల సమస్యలపై వివిధ అంశాలను చర్చించారు. మండల బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్ పర్సన్, ఎంపీపీ గొంది వాణిశ్రీ మాట్లాడుతూ బాలల హక్కుల చట్టాలను అమలు పర్చే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామస్థాయిలో కమిటీల ద్వారా చట్టాలపై ప్రచారం చేయాలని అన్నారు. 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా బాలల వికాసానికి పాటు పడాలన్నారు. బాలలు వివక్షకు గురైతే 1098కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాలు అమలు చేయడాన్ని అభినందించారు. మన మండల, గ్రామాలలో నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రతి ఒక్క పిల్లవాడికి, మనం తోడు ఉండేలా మన కమిటీలలో చర్చించుకోవాలని వివరించారు. అనంతరం మండల బాలల పరిరక్షణ కమిటీ కార్యదర్శి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ బాల్యంలో పొందాల్సిన అన్ని హక్కులను బాలలకు అందేలా చూడాలన్నారు. సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖతోపాటు చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్, విద్య వైద్య కార్మిక, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు అరికట్టేందుకు అవగాహన కల్పించాలన్నారు. సీడీపీఓ మల్లీశ్వరి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో అన్ని లైన్ డిపార్ట్మెంట్ అధికారుల సహకారం అవసరం అని అన్నారు. మండల బాలల పరిరక్షణ కమిటీ ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి మాట్లాడుతూ మండల బాలల పరిరక్షణ కమిటీ యొక్క విధులు, నిర్వర్తించాల్సిన బాధ్యతలు, ఉత్తమ బాలల పరిరక్షణ కమిటీ పాటించాల్సిన సూచికలను ఆయన వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థల నిషేధానికి గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు కృషి చేయాలన్నారు. ఎస్సై వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం తరఫున చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సహాయం అందిస్తామన్నారు. ఫోన్‌ద్వారా సమాచారం అందిస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామని, వివక్షకు గురవుతున్న బాలలను రక్షిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీల్ దొర, 15 మంది మండల బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు, మండల విద్యాశాఖ అధికారి యాప సాంబయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి కోరిక జై సింగ్, ఎంపిటిసిలు కుక్కల శ్రీను, ఇర్పవడ్ల భవాని నారాయణ, మేడిశెట్టి జయమ్మ, సిడిపిఓ మల్లీశ్వరి, ఐసిడిఎస్ సోషల్ మీడియా జ్యోతి, యూత్ నాయకులు, ఎన్జీవో సభ్యులు, డీసీపీఓ, ఏఎల్ఓ, మెడికల్ ఆఫీసర్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, మండల వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

పెట్రోల్ కోసమని వెళ్తూ ప్రమాదానికి గురైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మండలంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పర్వతాల భిక్షపతి మానసపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతని ద్విచక్ర వాహనంలో పెట్రోల్ లేకపోవడంతో పెట్రోల్ కోసమని జాతీయ రహదారి పక్కన గల పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో జాతీయ రహదారిపై ఏటూరు నాగారం వైపు కూలీలతో వస్తున్న టాటా ఎస్ వాహనం భిక్షపతిని డీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని గమనించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. ఈ విషయంపై స్థానిక ఉపాధ్యాయులు విచారణ వ్యక్తం చేస్తున్నారు.



దళిత ఎమ్మెల్యే ఐనందుకేనా ?

- మాదిగ జేఏసీ అసెంబ్లీ ఇన్‌చార్జి యాసం రమేష్

నవతెలంగాణ-వెంకటాపురం

ఐదు పర్యాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే సాయి కి అధికార లాంఛనాలతో అత్యక్రియలు జరపక పోవడం దళిత నాయకులు అనేనా అని తెలంగాణ ప్రభుత్వం తీరుపై మాదిగ జాక్ అసెంబ్లీ ఇంచార్జ్ యసం రాజు విమర్శించారు. మంగళవారం ఆయన విలేకర్లత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళిత నాయకుడు అయినందుకే అధికార లాంచనలతో అంత్యక్రియలు జరిపిం చకుండా దళిత జాతిని మరోసారి అవమాన పరిచారన్నారు. ఆంధ్రనాయకులు,చౌదరి, రెడ్డి నాయకులకు అధికార లాంచనలతో అంత్యక్రియలు జరిపించినపుడు, ఒక దళిత ఎమ్మెల్యే కు ఎందుకు జరిపించలేదని విమర్శించారు. ఆయనవెంట మండల అధ్యక్షుడు తోకల అంజి, గుద్దేటి చంటి, తోకల శివ ఉన్నారు.



ఆహ్లాదకరంగా మండలస్థాయి క్రికెట్ టోర్నీ

నవతెలంగాణ-వాజేడు

వెంకటాపురం మండలంలో నిర్వహిస్తున్న శ్రీ సమ్మక్క సారక్క క్రికెట్ టోర్నమెంట్ వాజేడు వెంకటాపురం మండలాల మండల స్థాయి టోర్నీలో మంగళవారం ఎస్సిమర్రిగూడెం, యాకన్న గూడెం జట్ల మధ్య పోటీ జరిగింది. కాగా ఏకన్నగూడెం జట్టు గెలుపొందింది. కొంగల, వై లేవెన్ జట్ల మధ్య పోటీ జరగగా కొంగాల జట్టు గెలుపొందింది. నూరవీడు యూత్ స్టార్ ప్రగల్లపల్లి జట్ల మధ్య జరిగిన పోటీలో ప్రగళ్లపల్లి విజయం సాధించింది. ప్రగళ్లపల్లి సర్పంచ్ పూసం నరేష్ కుమార్ చేతులు మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు తుమ్మ మహేష్‌కు అందజేశారు. బహుమతుల ప్రధాన దాతలు (కేవీ)బిఈ సివిల్ ఇంజనీర్ కొర్స వెంకటేశ్వరావు, క్రీడా నిర్వహణ కమిటీలో వైస్ చైర్మన్ పర్శిక సతీష్, తుర్స కృష్ణబాబు, కంతి నేత్ర నందు కుమార్, తుర్స చంటి, గొంది బాలకష్ణ, గొంది హనుమంతు, సిద్ది బోయిన భుజంగరావు తదితరులు ఉన్నారు.



జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో రాజుపేట విద్యార్థికి తృతీయ స్థానం

నవతెలంగాణ-మంగపేట

జిల్లా కేంద్రంలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని రాజుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి దాసరి అర్జున్ జ్ఞానదీప్ తృతీయ స్థానాన్ని సాధిం చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ విద్యార్థికి బహుమతి ప్రధానం చేశారు. మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టుల్లో దాసరి అర్జున్ జ్ఞానదీప్, లింగమల్లు హరీష్ నాగేంద్రగుప్తా మొదటి రెండు స్థానాల్లో జిల్లా స్థాయిలో పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి బహుమతి సాధించిన విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్, సైన్స్ ఫేర్ ఇన్‌చార్జి, ఉపాధ్యాయులు రంగు ఆనంద్, ఉపాధ్యా యులు, తల్లి తండ్రులు, తదితరులు అభినందించారు.



జిలాస్థాయి టాలెంట్ టెస్ట్ విజేతగా ఆరెందల విఙ్ఞేష్

నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యా పరిశోధన,శిక్షణ సంస్థ, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కాళేశ్వరం, మహదేవపూర్ శాఖ అధ్యక్షులు ఆరుట్ల భాస్కరాచారి సహకారంతో సీవీ రామన్ జయంతి-జాతీయ వైజ్ఞానిక దినోత్సవ సంబురాల్లో భాగంగా జిల్లా స్థాయి భౌతిక, రసాయన శాస్త్రం ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. ఇందులో మహాదేవ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్(బాలుర) 9వ తరగతి విద్యారర్ధి ఆరెందల విఙ్ఞేష్ మొదటి బహుమతి పొందాడు. మంగళవారం లయన్స్ క్లబ్ మహాదేవపూర్ శాఖ ప్రధాన కార్యదర్శి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మడక మధు, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు విఙ్ఞేషన్ అభినందించారు. ఉపాధ్యాయులు మడక మధు, విద్యార్థి విఙ్ఞేష్ ను సర్పంచ్ శ్రీపతిబాపు ప్రత్యేకంగా అభినందించారు.



పది ప్రత్యేక తరగతులను రాష్ట్రస్థాయి పరిశీలకుల పరిశీలన

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో తొలిమెట్టు, పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను రాష్ట్రస్థాయి పరిశీలకులు ఏవీఎస్ ఆచార్యులు, మనోహరాచారి, ఏఎమ్ఓ లక్ష్మణ్ మంగళవారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి స్పెషల్ టెస్టులు నిర్వహించాలన్నారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిపై చర్చించాలని చెప్పారు. తొలిమెట్టులో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రగతిని పరి శీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయం పీరియడ్ నిర్వహించాలని, తగిన టీఎల్ఎంతో విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొల్లం సతీష్, రత్న తిరుపతి, సిఆర్పి మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక







శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-హన్మకొండ

నెహ్రూ యువ కేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో యూత్ లీడర్ షిప్ మరియు కమ్యూనిటీ డెవలప్మెంట్ పైన రేపు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలనీ డిస్టిక్ యూత్ ఆఫీసర్ చింతల అన్వేష్ కోరారు. నెహ్రూ యువ కేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు వరంగల్ హంటర్‌రోడ్ లోని వ్యాసావాసంలో నిర్వహించే లీడర్షిప్ క్వాలిటీస్ అండ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫర్ యూత్ శిక్షణ శిబిరంలో యువత పాల్గొనాలని యువజన అధికారి చింతల అన్వేష్ తెలియజేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు 23 న శిబిరాన్ని చేరుకోవాలని 25 తేదీన ముగుస్తుందని తెలియజేశారు. దీనిలో ఆసక్తిగల యువత కింద తెలిపిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కొరకు ఏ భరత్ వీర్ 9966779838 సంప్రదించాలని కోరారు.

కొత్త కలెక్టర్‌కు స్వాగతం పలికిన పెరుకారి శ్రీధర్‌రావు

నవతెలంగాణ-హన్మకొండ చౌరస్తా



హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న సిక్తపట్నాయక్‌ను ఓరుగల్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెరుకారి శ్రీధర్ రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ అస్సోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్‌రావు జిల్లాకు వచ్చిన నూతన కలెక్టర్ సిక్త పట్నాయక్‌తో మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అభివృద్ధి కొరకైనా మా వాకర్స్ అసోసియేషన్ నుండి అందుబాటులో ఉంటామన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

జీడబ్ల్యుఎంసీ కమిషనర్ ప్రావీణ్య

నవతెలంగాణ-వరంగల్



జిడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో పలు డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జీడబ్ల్యుఎంసీ కమిషనర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం జిడబ్ల్యూఎంసీ పరిధిలోని పూర్తయిన పలు అభివృద్ధి పనులను బిల్లుల చెల్లింపు నిమిత్తం కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 31వ డివిజన్ లో సీఎస్ఆర్ గార్డెన్ ప్రాంతంలో నిర్మించిన డ్రైన్స్ లను, 42వ డివిజన్ లోని రంగశాయిపేట్ ప్రాంతంలో వెడల్పు చేసిన సిసి రోడ్‌ను, 40వ డివిజన్‌లోని ఉరుస్ ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, మురుగుకాలు వలను పరిశీలించారు. అనంతరం ఉర్సుగుట్ట ప్రాంతం నుండి నాయుడు పెట్రోల్ పంప్ వరకు సెంట్రల్ మెడియాన్స్‌లలో ఏర్పాటు చేసిన మొక్కలను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట బల్దియా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజయ్య, శ్రీనివాస్ రావు,డీఈలు సంతోష్ బాబు, నరేందర్, ఏఈ లు అరవింద, హబీబుద్దిన్, ముజమ్మిల్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి



మండలం లోని చెరువుకొమ్ము తండాకు చెందిన దరావత్ వెంకన్న, దరావత్ అనిల్ అలాగే పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన మెరుగు ఐలయ్య, నాగుల వీరయ్య, మామిండ్లపల్లి అనసూర్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం ఆయా కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమల, జడ్పీటిసి సింగులాల్,సొసైటీచైర్మన్ మనోజ్ కుమార్,నాయకులు సోమేశ్వర రావు,జితేందర్ రెడ్డి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బైరి రవికృష్ణకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సన్మానం



నవతెలంగాణ-కాజీపేట

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన బైరి రవికృష్ణని రాష్ట్రఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాదులోని రవీంద్ర భారతిలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగాకృషి చేయాలన్నారు. బీసీ కులగణన చేపట్టే విదంగా, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడా నికి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలన్నారు. రాష్టంలోని బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీసీసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు తాటికొండ విక్రమ్, బుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై దాడికి డీవైఎఫ్‌ఐ ఖండన

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

కాంగ్రెస్‌యువజన నాయకుడు తోట పవన్‌పై సోమవారం రాత్రి కొంతమంది దుండగులు దాడిచేసి తీవ్రంగాగాయపరచడాన్ని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట ఉపాధ్యక్షుడు దొగ్గేల తిరుపతి తెలిపారు. కొంతమంది మద్యం మత్తులో మునిగితేలుతూ మానవత్వాన్ని మరిచిపోతున్నారని, ప్రశ్నించే వారిని టార్గెట్ చేస్తూ దాడులు చేసి హత్యలకు పాల్పడే వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని, ఇలాంటి వాటిని ప్రోత్సహించే వారిని సహించకూడదని, రాజకీయ దురుద్దేశంతోనే, దాడులను ప్రోత్సహించడం, సరికాదన్నారు. ప్రశ్నించే వారిని దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయంఅన్నారు. రౌడీ,గుండాయిజంను పోలీసులు ఉక్కుపాదంతో అణచివేయాలని, ప్రశ్నించే గొంతులను కాపాడాలన్నారు.కాంగ్రెస్ యువజన నాయకుడు తోట పవన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దాడులను ప్రోత్సహించే వారిని గుర్తించి చట్టపరమైనచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంహెచ్‌వోగా డాక్టర్ రాజేష్ నియామకం



నవతెలంగాణ-వరంగల్

వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎంహెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రాజేష్‌ను సీఎంహెచ్‌వోగా, సీఎంహెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ జ్ఞానేశ్వర్‌ను ఎంహెచ్‌వోగా నియమిస్తూ జీడబ్ల్యుఎంసీ కమిషనర్ ప్రావీణ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎంహెచ్‌వోగా నూతన బాధ్యతలు అప్పగించినందుకు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ మర్యాద పూర్వకంగా బల్దియా మేయర్ గుండు సుధారాణిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మేయర్ నూతన సీఎంహెచ్‌వోను అభినందించారు. డాక్టర్ రాజేష్ ఎం హెచ్‌వోగా వున్నప్పుడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయనకు ఉత్తమ ఉద్యోగిగా ఇటీవల ఎన్నిక కావడం, ప్రస్తుతం సిఎంహెచ్‌వోగా నియామకం కావడం పట్ల అధికారులు, బల్దియా సిబ్బంది, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ రాజేష్‌ను కలిసిన వర్కర్లు, ఉద్యోగులు

వరంగల్ మహానగరపాలక సంస్థ నూతన ముఖ్య ఆరోగ్య అధికారి గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాజేష్ ని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ సంవత్సరం నూతనంగా ముద్రించిన టేబుల్ క్యాలెండర్ ను సీ ఎం హెచ్ వో ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం హెచ్ ఓ కి 452 మంది ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు పాతకార్మికులతో సమానంగా వేతనాలు పెంచాలని, అలాగే పాత పారిశుధ్య కార్మికులకు ఆంధ్రాలో ఇచ్చిన విధంగా రూ. 21 వేల వేతనాలు పెంచాలని, సీనియర్ జవాన్లకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాదిరిగా సానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా అవకాశం కల్పించాలని సీఐటీయూద్వారా కోరారు. కార్యక్రమంలో సానిటరీ సూపర్ వైజర్ మాదాసు సాంబ య్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు , రాష్ట్ర కార్యదర్శి జన్ను ప్రకాష్, రాచపల్లి సాంబయ్య, జక్కిడి రామకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత

నవతెలంగాణ-నడికూడ

మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెచ్ఎం అచ్చుసుదర్శన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిగ్గుల శ్రీదేవి, మోడెం సుకన్య, బాబురావు,అంగన్‌వాడీ టీచర్స్ భీముడి లక్ష్మీ, నందిపాటి సంధ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాయనం దోపిడీ సమాజ మార్పుకు దోహదం

సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య



నవతెలంగాణ-మట్టెవాడ

సమాజంలో కొనసాగుతున్న అసమానతలను, దోపిడి వ్యవస్థవిధానాలను అర్థం చేసుకోవాలన్నా ప్రతీఒక్కరు మార్క్సిస్ట్ తత్వవేత్తలు,శాస్త్రవేత్తలు ఈ సమాజ మార్పుకోసం ప్రాణత్యాగాలు చేసిన త్యాగ ధనుల జీవితగాథలు చరిత్రలను భావితరాలు అర్థం చేసుకునేందుకు శాస్త్రీయ సాహిత్యాన్ని అధ్యయనం చేయటం అవసరమని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య అన్నారు. మంగళవారం రామన్నపేట రఘునాథ్‌కాలనీ పార్టీ కార్యాలయంలో రెడ్‌బుక్‌డే కార్యక్రమం సీపీఎం జిల్లా నాయకులు అరూరి కుమార్ అధ్యక్షతన జరుగగా ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి సి హెచ్. రంగయ్య హాజరై ఈ సందర్భంగా మాట్లాడారు, రెడ్ బుక్‌డే సందర్భంగా మోక్షిస్తూ మహోపాధ్యాయులైన మార్క్స్ ఎంగిల్స్ లెనిన్ స్టాలిన్ మావోల విప్లవ సాహిత్యాన్ని ఈ దేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగాచేసి ఊరికొయ్యలను ముద్దాడి దేశం కోసం నవ్వుతూ ఊపిరి వదిలిన మహానుభావుడు భగత్‌సింగ్ రాజగురు సుఖదేవులు సుభాష్ చంద్రబోస్ లాంటి అనేకమంది, విప్ల వ పోరాటస్ఫూర్తిని భావితరాలకు అందించే, విప్లవ సాహిత్యోద్యమమే ఈరోజు నిర్వహిస్తున్న రెడ్ బుక్కు డే అని ఇందులో చదువుకున్న మేధావులు అత్యధికంగా విప్లవ సాహిత్యాలను అధ్యయనం చేసేందుకు చరిత్రను శాస్త్రీయంగా అవపోసన పట్టే ప్రజలకు అందించి ప్రజాచైతన్యం తీసుకువచ్చేందుకు ముందుకు రావాలన్నారు. నేడు బీజేపీ మతతత్వ ఫాసిస్టు చర్యలతో చరిత్రలను వక్రీకరించేఇందుకు కుటిల యత్నాలు చేస్తున్నదని పూర్తిగా మహానుభావులను, వారు చేసిన త్యాగాలను, కార్యక్రమాలను, కులమతాలకు పరిమితం చేసే ఒక మతతత్వ కోణం నుంచి సాగిస్తున్న తీరును ఎండకట్టాల్సిఉందని అన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారం బాబుమాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రజా సమస్యలను పూర్తిగా అధ్యయనం చేయడానికి విప్లవ శాస్త్రీయ సాహిత్యాలు ఎంతో దూరం చేస్తాయని అందుకోసం కార్యకర్తలు నిరంతర అధ్యయనం చేయాలని అన్నారు. అనంతరం భగత్ సింగ్ పుస్తకాన్ని అధ్యయనం చేశారు. కార్యక్రమంలో శాఖకార్యదర్శి చెవుల శ్రీనివాస్ బీ.సంగీత, ఎన్.రేణుక, గూడూరు విజయ్ కుమార్ ఇనుముల కిరణ్, దరిపెల్లి కుమార్, జన్ను యాకయ్య, ఎండి.యాకూబ్, దివ్య అనుష మల్లేశ్వరి, సావిత్రి, అలేఖ్యనవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులు... పట్టించుకోని అధికారులు

- కాలువ నిర్మాణ పనుల్లో నిబంధనలకు నీళ్లు
- ఇంజనీరింగ్ అవతారం ఎత్తిన కాంట్రాక్టర్
- నాసిరకం మెటీరియల్‌తో నడుస్తున్న కాలువ పనులు
- చోద్యం చూస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

నవతెలంగాణ-ఆత్మకూర్



జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం చేపట్టిన ఆత్మకూర్ పెద్ద చెరువు ప్రధాన కాలువ పనుల్లో కాంట్రాక్టర్ నిబంధనలను తుంగలో తొక్కి నాసిరకం పనులు చేస్తున్నా కూడా పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులపై గ్రామస్తులు మండి పడుతున్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని పెద్దచెరువు కాలువ గ్రామం నడిమధ్యనుండి రాయకుంట చెరువువరకు కాకతీయుల కాలంలో పదిహేను ఫీట్ల వెడల్పుతో నిర్మించారు. కాలక్రమేనా చెరువుమాయం కావడంతో కాలువ కూడా వాడకంలో లేకపోవడంతో వాడుక నీరు వర్షం నీరు నిలవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. సర్పంచ్ పర్వతగిరిరాజు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోవడంతోపాటు అప్పటి జిల్లా కలెక్టర్ ఎం.హరితకు పలుమార్లు వినతిపత్రం ఇవ్వడంతో జాతీయ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఇటీవల కాంట్రాక్టర్ నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకఫీటులోతు కంకరవేసి దాని పైన ఇరువైపులా సిమెంట్ కాంక్రిట్‌తో సిమెంట్ వేయవలసి ఉంది కానీ కాంట్రాక్టర్ అధికార పార్టీ అండదండలతో ఇంజనీరింగ్ అధికారులతో కుమ్మకై ఫీటుకు బదులు 7-8 ఇంచులే ఇసుక,సిమెంట్,కంకర బదులు అందులో స్టోన్‌డస్ట్ పోసి కాంక్రీట్ వేస్తున్నారు. 8 ఫీట్లలకుబదులు కొన్ని చోట్ల ఐదు, ఆరు ఫీట్లు ఇష్ట రాజ్యాంగ వేస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు ఉండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక, సిమెంట్, కంకరకు బదులు డస్ట్ పోయడంతో వేసిన కాంక్రీట్ నీళ్ల కొడుతుంటే లేచి పోతుందని గ్రామస్తులు అంటున్నారు.

ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణం పనులు జరిగేటప్పుడు లేకున్నా కూడా కాంట్రాక్టరే ఇంజనీరింగ్ అవతారమెత్తి తన ఇష్టారాజ్యాంగా నిర్మాణం పనులు చేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం వెనుకున్న ఆంతర్యంఏమిటీ ? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ రమేష్ గతంలో చలివాగు వాటర్‌షెడ్ నిర్మాణం పనులలో నాసిరకంగా పనులు చేసి అధికార పార్టీ అండదండలతో భారీగా బిల్లులు తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అయినా కూడా అదే కాంట్రాక్టర్ కు తిరిగి కాలువ కాంట్రాక్టు పనులు ఇవ్వడం పలు విమర్శలకు తావు ఇస్తుంది. అధికారులు కాంట్రాక్టర్ లతో కుమ్మకై ముడుపులు పుచ్చుకుంటున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్ రమేష్ నీరుకుల్ల గ్రామంలో ఎస్ఆర్ఎస్పీ కాలువను కూడిపి చెరువులో మట్టిని ఎలాంటి అనుమతులు లేకున్నా తానుపట్టిన కాంట్రాక్ట్ పనులకు పోసుకున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ నాసిరకం పనులు చేయడం వల్లా మూడు నల్లమురిపానికే పరిమితం అవుతుందని గ్రామస్తులు అంటున్నారు. ఎప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించి నాణ్యతతో కూడిన పనులను చేయించాలని కోరుతున్నారు.

నాసిరకం పనులు చేస్తే సహించేది లేదు : ఇర్సడ్ల సదానందం

కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తే బీఆర్ఎస్ నేతలు నాసిరకం పనులు చేసుకుంటూ భారీగా బిల్లులు తీసుకుంటు న్నారని బీజేపీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం ఆరోపించారు ఆత్మకూరులో నిర్మాణం అవుతున్న సైడు కాలువ పనులను జిల్లా బీజేపీ అధికారులు పరిశీలించి ఇక్కడ జరుగుతున్న అవినీతి అక్రమాలను కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుక పోతామని అన్నారు.ఇంజనీరింగ్‌అధికారులు పనులు చేస్తున్న పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి నాణ్యతతో కూడిన పనులు చేయించుకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు.

పనులను పరిశీలిస్తాం : లింగారెడ్డి, డిఈ

నాసిరకం పనులు చేస్తే బిల్లులు ఇవ్వం పనులను పరిశీలించి నాణ్యత లేకుంటే తిరిగి మళ్లి వేయిస్తాం అని పంచాయితీ రాజ్ డిఈ లింగ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఏఈని ఆదేశించామని స్థానికంగా ఉండి పనులు చేయించామని చెప్పాం అయిన కూడా జాతీయ ఉపాధి హామీ పనుల్లో నాణ్యత లోపిస్తే ఎట్టిపరిస్థితుల్లో బిల్లులు చేయమని డిఈ లింగారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి





నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్‌పై పాశవికంగా దాడికి పాల్పడిన ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, అతని అనుచరులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు వరంగల్ పోలీస్ కమీషనర్‌ను కలిశారు. ఎ మ్మెల్యే వినయ్‌భాస్కర్‌గుండాల పాశవిక దాడిలో తీ వ్రంగా గాయపడిన యూత్‌కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌ను టీపీసీసీ అధ్యక్షులు,మల్కాజ్‌గిరి ఎంపి ఎ.రేవంత్ రెడ్డి, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డిలు పరామర్శించారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు పోలీస్ కమీషనరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, రాష్ట్ర, జిల్లానేతలు కలిసి ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అతని అనుచరులపై హత్యా నేరం కేసు నమోదు చేయాలంటూ వరంగల్ పోలీస్ కమీషనర్ ఏవి రంగనాథ్ కలిసి ఫిర్యాదుచేసారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, మాజీమంత్రి కొండా సురేఖ, మాజీ ఎంపిలు మల్లు రవి, సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎంఎల్‌సి కొండ మురళీధర్ రావు, వరంగల్ ఎంపిగా పోటి చేసిన అభ్యర్థి దొమ్మాటి సాంబయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, టీపీసీసీ కార్యదర్శి ఈవి శ్రీనివాస్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ధూషణలతో ఓట్లు రాలతాయా ?

రెచ్చగొట్టే ప్రసంగాలనే నమ్ముకుంటున్న ప్రధాన ప్రతిపక్ష అధినాయకులు







నవతెలంగాణ-హన్మకొండ

తెలంగాణ రాష్ట్రంలో గత రెండు సార్లు జరిగిన సార్వత్రికఎన్నికల్లో అధికార పార్టీతో పోటీపడి రెండుసార్లు భంగపడిన ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలతోపాటు వైయస్సార్‌టీపీ, బీఎస్పీలు కూడా రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని సర్వశక్తులు ఒడ్డుతున్నారు. దాదాపు అన్నిపార్టీల అధినాయకులు అందరూ రాష్ట్రంలో పాదయాత్రలు చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏలాంటి పాలన అందిస్తామో నిరుద్యగ యువతకు, రైతులకు ఎ లాంటి పథకాలు అమలు చేయాలని అనుకుంటున్నారో సవివరంగా ప్రజలకు వివరించి అధికార పార్టీ టిఆర్ఎస్‌కు ముచ్చెమటలు పట్టించాల్సిన ప్రతిపక్ష నాయకులు రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, వైయస్ షర్మిల, ప్రవీణ్‌కుమార్‌లు కేవలం వ్యక్తిగత దూషణలతో రెచ్చగొట్టే ప్రసంగాలనే నమ్ముకుంటూ ప్రచారం చేస్తున్నారు.కానీ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ తనదైన శైలితో పావులు కదుపుతున్నాడు. గత రెండు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన కేసీఆర్ గతమునుగోడు ఎన్నికల నుండి సాంప్రదాయ ఓటు బ్యాంకు కలిగిన వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ పార్టీలను కలుపుకొని ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో కూడా వారిమద్దతుతో పోరాటానికి సిద్ధమవుతున్నాడు. గత ఎన్నికల్లో అంతాతానై ఎన్నికల ప్రచారం ఒంటిచేత్తో నడిపించిన కేసీఆర్‌కు ఇప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, కవితలతోపాటు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు కూడా ప్రచారం చేయడానికి అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రజలను తనయాస, ప్రాసతో ఆకట్టుకుంటున్న కేసీఆర్ కు మరోఐదుగురు స్టార్‌క్యాంపెనర్లు రాష్ట్రంలో ప్రచారం చేయడానికి సిద్ధపడుతున్నారు. ఇంతటి వాగ్దాటి కలిగిన నాయకులను ఎదుర్కోవాలంటే ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ఆరోగ్యవంతమైన ప్రసంగాలతో అధికారంలోకి రావలసిన ప్రధాన ప్రతిపక్ష నాయకులు కేవలం వ్యక్తిగత దూషణలు, ప్రగతి భవన్ గుమ్మటాలు కూలుస్తామని ఒకరంటే... బాంబులతో పేలుస్తామని మరొకరు అంటున్నారు. ఇక మరో ప్రతిపక్ష నాయకురాలు ఒక స్త్రీ అన్న సంగతి మర్చిపోయి మగతనం గురించి మాట్లాడుతుంది.తమ ప్రసంగాలతో ప్రజలను ఆకట్టుకోవాల్సిన ప్రతిపక్షాలు రెచ్చగొట్టే ప్రసంగాలతో యువతను పక్కదోవ పట్టిస్తున్నారు. మొన్న మహబూబాబాద్‌లో షర్మిల అక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా దూషించి అరెస్టు అయితే ఇప్పుడు హనుమకొండలో రేవంత్ రెడ్డి ప్రసంగాలతో కాంగ్రెస్ యువ నాయకుడు తోట నవీన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో చావు దెబ్బలు తిని చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

జర్నలిస్టుల సేవలు గొప్పవి

- ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సాయం చేస్తా
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



నవతెలంగాణ-హన్మకొండ

సమాజంలోని రుగ్మతలను తొలగిస్తూ ప్రజా చైతన్యానికి పాటుపడుతున్న జర్నలిస్టుల సేవలు చాలా గొప్పవని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాజయ్యను హన్మకొండ లోని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సదయ్య మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన వంతుగా కృషి చేయాలని ఎమ్మెల్యే రాజయ్యను కోరారు. అనంతరం ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూతన రాజకీయ జీవితం ఎదుగుదలలో జర్నలిస్ట్ పాత్ర ముఖ్యమైనద న్నారు. వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో చేపట్టనున్న నూతన భవన నిర్మాణానికి నిబంధనలు అంగీకరిస్తే తన నియోజకవర్గం అభివృద్ధి నిధుల నుంచి కలెక్టర్‌తో చర్చించి రూ.10 లక్షలు ఇస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, అల్లం రాజేష్ వర్మ, యాంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు సంపెట సుధాకర్,వలిశెట్టి సుధాకర్,పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు వీరగోని హరీశ్, దొమ్మాటి శ్రీకాంత్, ఆంజనేయులు, నయీంపాషా, కమటం వేణుగోపాల్, నన్నపునేని భరత్, మంచాల రాజు పాల్గొన్నారు.

సిరిపురం యాదయ్యకు కొవ్వొత్తుల నివాళి

నవతెలంగాణ-వేలేరు



సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా వేలేరు ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మండలకేంద్రం వేలేరు అమరవీరుల స్థూపం నుండి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సద్దాం హుస్సేన్ మాట్లాడు తూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ప్రాణాలను అర్పించిన సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా వారిత్యాగాన్ని స్మరించుకుంటూ జోహార్లు అర్పించారు. 1200 మంది అమరుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని, అమరుల పునాదుల మీదపదవులు అనుభవిస్తున్న బిఆర్ఎస్ నాయకులు ఉద్యమకారులం అని చెప్పుకు తిరిగేనాయకులు నేడు వారిని స్మరించుకోవడం కోసం కనీసం వేలేరు మండల కేంద్రంలో వారి వర్ధంతిని నిర్వహించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వారితోపాటు అక్కల ప్రశాంత్, కృపాసాగర్, కొయ్యడ రాజేష్, గణేష్, ప్రవీ ణ్, భరత్,ప్రశాంత్, శివ, తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల తొలగింపు

నవతెలంగాణ-వరంగల్



బల్దియా పరిధిలోని మడికొండ రామన్ పాఠశాల ప్రాంతంలో 15 ఫీట్ల వ్యవసాయ నాలను ఆక్రమించుకొని అనధికారికంగా నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను హన్మకొండ జిల్లా ఎన్ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో బల్దియా డీఆర్ఎఫ్, టీమ్‌అట్టి నిర్మాణాన్ని మంగళవారం తొలగించారు. అనధికారికంగా స్థలాలను అక్రమించుకుని నిర్మాణాలు చేస్తే అట్టి నిర్మాణాలను తొలగించడంతో పాటు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసు నమోదు చేస్తా మని సిటీ ప్లానర్ వెంకన్న తెలిపారు. టీఎస్ బి-పాస్ ద్వారా అనుమతి పొందిన తర్వాత మంజూరు చేసిన నక్షా ప్రకారమే ఎలాంటి అతిక్రమణలు లేకుండా భవనాలు నిర్మించుకోవాలని తెలిపారు. కార్యక్రమం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన న్యూ లయోలా విద్యార్థులు

నవతెలంగాణ-సుబేదారి



హనుమకొండ కుమార్‌పల్లి మార్కెట్ సమీపంలోని న్యూ లయోలా హైస్కూల్ విద్యార్థులు కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ స్కూలు 40వ వార్షికోత్సవ వేడుకలకు కలె క్టర్‌ను ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రజ, కార్తీక్, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింప చేయాలి

ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మందకుమార్

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం 18వ డివిజన్ పరిధిలోని ప్రతాప్ నగర్ (లేబర్ కాలనీ) లోని కమ్యూనిటీ హాల్ లో ఎమ్మెస్పి జిల్లా ఇన్చార్జ్ బిరు మహేందర్ అధ్యక్షులు జరిగిన విలేకరుల సమావేశంలో మంద కుమార్ మాట్లాడుతూ ఈనెల 22 నుండి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో జరుగుతున్న పాదయాత్రను, మార్చి 15న జరిగే రహదారుల దిగ్బంధం జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజులలో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి గద్దె నెక్కిన బిజెపిఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎస్సీల వర్గీకరణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మాదిగలను మోసం చేయడమే అన్నారు.

ఈనెల 22 నుండి పాదయాత్ర ...

ఎస్సీ ఎబీసీడీ వర్గీకరణ విషయంలో బీజేపీ చేసిన మోసాన్ని ఎండగడుతూ ఈనెల 22 నుండి ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రను ఎస్సీ వర్గీకరణను సమర్థించే అన్ని పార్టీలు, ప్రజా, కుల సంఘాలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నర్సంపేట, వరంగల్ తూర్పు ఇన్చార్జిలు కల్లేపల్లి ప్రణయ్ దీప్, ఈర్ల కుమార్, ఎమ్మెస్ పి నాయకులు తడుగుల విజయ్, మాసాని గోపాల్, గోలి సుధాకర్, కోటరాజు, గంగారపు మల్లన్న, సింగారపు ఆనంద్‌లు పాల్గొన్నారు.



నవతెలంగాణ
మహబూబాబాద్, జనగామ
4
బుధవారం 22 ఫిబ్రవరి 2023



అభివృద్ధి పనులపై నేడు కలెక్టరేట్‌లో సమీక్ష

దశలవారీగా కాలనీలకు వీధిలైట్ల ఏర్పాటు : పాల్వాయి రామ్మోహన్ రెడ్డి



మతోన్మాదం అత్యంత ప్రమాదకరం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్ : నాగపురి



రైల్వేల ప్రైవేటీకరణ ఆపాలి, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలి : సీఐటీయూ



కార్మిక వ్యతిరేక విధానాల అమలు చేస్తున్న ప్రభుత్వాలు

కార్మికులు హక్కుల సాధనకై పోరాడాలి - కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలి - ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.సీతారామయ్య



పోడుపట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తికి అవమానం

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ విమర్శ



తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మనఊరు-మనబడి పాఠశాలలు



కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలి

ట్రైనీ కలెక్టర్ పింకేష్ కుమార్



ఏకగ్రీవ పంచాయతీలకు నిధులు ఇవ్వండి : సర్పంచ్ లక్ష్మి

అధికారుల అండతో ఎరువుల దందా...

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న వ్యవసాయ అధికారులు



ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు



భర్తపై భార్య బంధువులు దాడి - అరెస్ట్



నా నుంచి రోగాలు మొదలయ్యాయి : దిడ్డి వెంకన్న రైతు



వ్యవసాయ అధికారి బి.చత్రు నాయక్



రేషన్ షాపు తనిఖీ




ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం : జి.నాగయ్య



23న బయ్యారంలో క్యాన్సర్ క్యాంపు




ఎమ్మార్వో కార్యాలయంలో భూ బాధితుల నిరసన



విద్యుత్ షాక్‌తో బర్రె మృతి









లింగమడుగుపల్లి లో పారిశుద్ధ్య స్థితిగతులపై సర్వే

నవతెలంగాణ-ఆత్మకూర్

స్వచ్ఛ భారత్ మిషన్ రెండవదశ అమలులో భాగంగా ఆత్మకూర్ మండలం లోని లింగమడుగుపల్లి గ్రామంలో ఇళ్లల్లో, ప్రభుత్వ సంస్థల్లో పారిశుద్ధ్య సౌకర్యాల అంచనా కోసం బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వే లో మురికినీరు, ఘన వ్యర్థాల నిర్వహణ ఎలా ఉంది, వ్యక్తిగత మరుగుదొడ్ల స్థితి ఎలా ఉంది అని సర్వే ద్వారా తెలుసుకున్నారు. పారిశుద్ధ్యలోపం లేకుండా ప్రజలు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిల్లెల రాజేశ్వరి, ఎంపీడీఓ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, శిక్షకులు ఎంపీఓ రవి కుమార్, ఎపిఓ కుమార్, శ్రీనివాస్, ఎంపిఓ చేతన్ కుమార్ రెడ్డి, ఎపిఓ రాజి రెడ్డి ఎస్ బి ఎం సిబ్బంది ప్రవీణ్, సంపత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నడికూడ

మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం సొసైటీ డైరెక్టర్ గోనెల రామ్మోహన్ తండ్రి గోనెల బాబు ఇటీవల గుండెపోటుతో మరణించగా రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నాగుర్ల యువసేన నాయకులు వరికెల కిషన్ రావు, లోకేటి నగేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యంను అందించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సొసైటీ చైర్మన్ తాళ్ల శ్యామ్ రాజ్, వైస్ చైర్మన్ గోనెల రమేష్, డైరెక్టర్లు తాళ్ల సామి, తాళ్ల రవి, తాళ్ల మేనయ్య, తాళ్ల రమేష్, యువసేన నాయకులు పోచంపల్లి విజయ్ కుమార్, బాధగాని శ్రీధర్, గోనెల మహేష్, మోకిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

నగర మేయర్ గుండు సుధారాణి



నవతెలంగాణ-వరంగల్

జిడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవం తంగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతి డివిజన్లవారిగా అధికారులతో కూలంకశంగా సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహా నగరంలో పట్టణ ప్రగతి, జనరల్‌ఫండ్, సిఎంఎ, ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్, తదితర పథకాల క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు టెండర్ అయిన పనులను తక్షణమే ప్రారంభించాలని, ఇంకను మిగిలియున్న వాటికి వెంటనే టెండర్ ప్రక్రియపూర్తి చేయాలన్నారు.కాంట్రాక్టర్లుసకాలంలో చేయని పక్షంలో ఆయా పనులను రద్దు చేయాలని, రద్దు చేసిన పనులకు జాప్యం జరుగ కుండా వెంటనే తిరిగి టెండర్ పిలవాలని సూచించారు. ఈ సమీక్షలో ఎస్ఈ కృష్ణరావు, డీఈలు రవి కుమార్, నరేందర్, సంతోష్ బాబు, రవి కిరణ్, సారంగంలు పాల్గొన్నారు.

భౌతిక దాడులకు పాల్పడితే ఉపేక్షించం

నవతెలంగాణ-శాయంపేట



బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుండాల మాదిరిగా భౌతిక దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మండల కాంగ్రెస్ యూత్ నాయకులు మారపల్లి కట్టయ్య హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హన్మకొండలో సోమవారం టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పాదయాత్రలో జిల్లా యూత్ నాయకుడు తోట పవన్‌పై బిఆర్ఎస్ గుండాలు దాడి చేయడానికి తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం పై వ్యతిరేకత పెరిగిపోయిందని, ప్రజలు కూడా గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే బిఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పాదయాత్రలో ప్రజల నుండి పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే అనుచరులు కాంగ్రెస్ యూత్‌లీడర్‌పై దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి రాష్ట్రంలో భౌతిక దాడులు పెరిగాయని, ఇకనైనా తమ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చాక బిఆర్ఎస్ అక్రమార్కుల భరతం పడతామని, అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలకు వత్తాసుపలుకుతున్న అధికారులను కూడా వదిలిపెట్టమని హెచ్చరించారు. ఇలాంటి భౌతిక దాడులు పునరావతమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రజినీకాంత్, సుకుమార్, మొగిలి పాల్గొన్నారు.

వైయస్ షర్మిల హిజ్రాలకు క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-మట్టెవాడ

హిజ్రాలను కించపరిచేలా మాట్లాడితే ఊరుకునేది లేదని తెలంగాణ ట్రాన్స్ జెండర్ అధ్యక్షురాలు లైలా అన్నారు. వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మహబూబాబాద్ లో హిజ్రాలను కించపరిచేలా కొజ్జాలు అంటూ సంబోధించడానికి నిరసిస్తూ ట్రాన్స్ జండర్లతో కలిసి పోస్టఆఫీస్ కూడలిలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వైయస్ షర్మిల డౌన్‌డౌన్ అంటూ షర్మిల చిత్రపటాన్ని దహనం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిజ్రాల కమ్యూనిటీని కించపరిచేలా బోధించడం షర్మిలకు మంచిది కాదని చిన్న చూపుకు గురవుతున్న హిజ్రాల పట్ల సానుభూతితో ఉండాలి కానీ కొజ్జాలు అంటూ సంబోధించడం ఆమెకు శ్రేయస్కరంకాదని మండిపడ్డారు. హిజ్రాల సమాజానికి బేషరతుగా వైయస్ షర్మిల క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హిజ్రాల సంఘం జాయింట్ సెక్రటరీ రంజిత, రేష్మ సుధా ప్రియాంక, అశ్విని, అంజు, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నడికూడ

మండలంలోని నర్సక్కపల్లి జీపీ సఫాయి కోడెపాక మురళి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ వారి పార్థివ దేహానికి పూల మల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండా శంకరయ్య, కోడెపాక ఐలయ్య, కిన్నెరా మల్లేశం, బండి రవి, కిన్నెరా రమేష్, బుర్ర సురేందర్, గ్రామా కమిటీ అధ్యక్షులు జుక్క జువ్వ కుమారస్వామి, ప్రధానకార్యదర్శి తాళగంప్ప రాజు, రవి, గుర్రాల సాంబరెడ్డి, ఆవుల రవీందర్, మూంజ విజేందర్, జుంక్క జువ్వ శ్రీను, కోడెపాక శ్రీను, నడికుడ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోడెపాక ప్రశాంత్, సదయ్య, రవీందర్, రాజు, మోటపోతుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హామీలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం : బీజేపీ

నవతెలంగాణ-శాయంపేట

ఎన్నికల ముందు ఇచ్చినహామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రభుత్వం కాలయాపన చేస్తూ పబ్బం గడుపుకుంటుందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షు లు రాయరాకుల మొగిలి అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో శక్తి కేంద్ర ఇంచార్జ్ కొత్తపల్లి శ్రీకాంత్ అధ్యక్షతన మంగళవారం కార్నర్ సమావేశం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా మొగిలి పాల్గొని మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మశాన వాటిక, మరుగుదొడ్లు, ఉజ్వల గ్యాస్, పల్లె ప్రకతి వనం, ఉపాధి హామీ పథకం, ఉచిత రేషన్ బియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో చాలామంది నిరుపేదలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తే నిరుపేదలకు తక్కువ డబ్బుతో మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు, బిజెపి పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందుతాయని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో బూత్ అధ్యక్షులు జంగా సదయ్య, సంతోష్, శంకర్, విద్యాసాగర్, దేవరాజ్, మహేష్, నాగరాజు, రాజు, నవీన్, శేఖర్, సుమన్, సాంబయ్య, ఐలయ్య, రాజు పాల్గొన్నారు.



సోషలిజం వైపు మరల్చడమే సాహిత్య పఠనం : సీపీఐ(ఎం)





నవతెలంగాణ-మట్టెవాడ

కమ్యూనిస్టు మేనిఫెస్టో ఏర్పడి నేటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని ప్రపంచవ్యా ప్తంగా ఈరోజును రెడ్‌బుక్‌డేగా పెద్దఎత్తున నిర్వహించు కోవడం జరుగుతుందని సీపీఐ(ఎం) రంగసాయిపేట ఏరియా కార్యదర్శి మాలోత్ సాగర్ అన్నారు. ఖి లా వరంగల్ మండలం రంగసాయిపేట ఏరియా శాఖ ఆధ్వర్యంలో జొక్కలోద్ది, బెస్తంచెరువు గుడిసె సెంటర్లలో రెడ్ బుక్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2000 పైచిలుకు ప్రజలకు భారత విప్లవకెరటం భగత్‌సింగ్ పుస్తక పఠనం సామూహి కంగా ఒకేచోటున కూర్చొని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో సాహిత్య పఠనం ద్వారా ఏది మంచో ఏది చెడు తెలుసుకోవ డం జరుగుతుందని నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ భగత్ సింగ్ చరిత్రను తెలుసుకోవాలని అన్నారు. నేటి పాలకులు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. గోవింద్ పన్సారే మతోన్మాదానికి వ్యతిరేకంగా అసమానతానికి వ్యతిరేకంగా రచనలు చేశారని ఆయనతోపాటు మరింత మంది రచయితలు రచనలు చేశారని అన్నారు.

బీజేపీ ప్రభుత్వంలో మతోన్మాద శక్తులు వామపక్ష భావజా లాన్ని ప్రచారం చేసే రచయితలతో పాటు ప్రింటింగ్, ప్రచురణ కర్తలతో పాటు జర్నలిస్టుల పైన కూడా దాడులు చేస్తున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తులు కమ్యూనిస్టు సాహిత్యాన్ని సహించలేని పరిస్థితుల్లో ఉన్నాయని దానికి తార్కానమే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల పైన జరుగుతున్న దాడులను అన్నారు. నేటి పరిస్థితులను దష్టిలో పెట్టుకొని ఈ సాహిత్యాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకువెళ్లాలని అందుకు ప్రతి ఒక్కరు సాహిత్యాన్ని చదివి నాటివిప్లవ వీరుల త్యాగాలను తెలుసుకోవాలన్నారు. ఫిబ్రవరి 21న వరల్డ్ బుక్ డే గా ప్రకటించి ఢిల్లీ లోని లెఫ్ట్ వరల్డ్ బుక్ సంస్థ రెడ్ బుక్ డేను జరుపుతుందని గుర్తు చేశారు. కమ్యూనిస్టు ప్రణాళికలో భాగంగా రచించి ఆరోజునే విడుదల చేసి ప్రపంచ వ్యాప్తంగా అన్ని శక్తులను ఊరట ఇచ్చిందని విముక్తి కోసం కమ్యూనిస్టు ప్రణాళిక ఒక మార్గాన్ని ప్రపంచానికి చూపెట్టిందని పెట్టుబడిదారీ వ్యవస్థను నాశనం చేసి సోషలిజం వైపు ప్రజలను మళ్లించేందుకు మార్గాలను సుగుణంచేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలోతు ప్రత్యూష, సాంబమూర్తి, గానే పాకఒదేలు, సందీప్, చందులు పాల్గొన్నారు.

మత రాజ్యాలు నిర్లజ్జ దోపిడి కేంద్రాలు : ఎం.చుక్కయ్య

ఐనవోలు : మత రాజ్యాలు నిర్లజ్జ దోపిడి కేంద్రాలుగా మారి ఈ దేశ సంపదలను పెట్టుబడిదారులైనా ఆదాని, అంబానీలకు బిజెపి మోడీ ప్రభుత్వం దోచిపెడుతుందని సీపీఎం జిల్లా నేత ఎం.చుక్కయ్య కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.మంగళవారం మండలం వెంకటాపురంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రెడ్ బుక్ డే సభ పార్టీ మండల కమిటీ సభ్యులు ముల్కల గూడెం సర్పంచ్ బండి పర్వతాలు అధ్యక్షతన నిర్వహించారు. భారత విప్లవ కెరటం భగత్ సింగ్ పుస్తక ఆవిష్కరణ చేసిన అనంతరం చుక్కయ్య మాట్లాడుతూ భారత స్వతంత్ర సమరయోధుల్లో విప్లవకారులు, సోషలిస్టులలోను అగ్రశ్రేణికి చెందిన వారిలో భగత్‌సింగ్ ఒకరు మన దేశంలో మొట్టమొదటి మార్క్సిస్ట్ సిద్ధాంత ఆలోచన పరులలో భగత్‌సింగ్ ఒకరు స్వతంత్ర పోరాటంలో ఈదేశం నుండి బ్రిటిష్ వారు వెళ్ళిపోవాలని పార్లమెంటుపై బాంబువిసిరిన మతతత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటంచేశారు. ఈ పోరాటాన్ని జీర్ణించుకోలేని బ్రిటిష్ ప్రభుత్వం భగత్ సింగ్ ను అరెస్టు చేసి రాజద్రోహం కింద తన 23 ఏళ్లలోనే భగత్‌సింగ్‌తో పాటు రాజగురువు సుగుదేవులను నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీయించిందిని అన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి తర్వాత మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మతాల మధ్య కులాల మధ్య న చిచ్చులు రగిలిస్తూ ఈ దేశాన్ని అల్లకల్లో చేస్తుందని ఇలాంటి మతవున్మాదులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని చుక్కయ్య పిలుపునిచ్చారు.

పార్టీ మండల కార్యదర్శి లింగయ్య మాట్లాడుతూ భగత్‌సింగ్ స్వతంత్ర పోరాటం తో పాటు సామ్రాజ్యవాదానికి దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారన్నారు. నేటి యువత భగత్ సింగ్ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని యువతకు లింగయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గుండెకారి మహేందర్,కొంకల నారాయణరెడ్డి, దీకొండ ఉప్పలయ్య, కొంకటి శంకర్ రెడ్డి, మోహన్ రావు, రాయపురపు కొమురయ్య, బాబురావు, సలీం, సంతోష్, మచ్చ కుమార్, నాగరాజు, మాజీ సర్పంచ్ మాణిక్యం, సరోజన, సజన, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చినోల్లకు ఒక్క అవకాశం ఇవ్వండి : రేవంత్‌రెడ్డి

తూర్పులో కొనసాగిన రేవంత్ రెడ్డి పాదయాత్ర - తూర్పులో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి / వరంగల్

తెలంగాణ రాష్ట్ర ఇంచినోల్లకు ఒక్క అవకాశం ఇచ్చి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రాబోయే ఎలక్షన్లలో కొండా సురేఖని గెలిపించాని టిపిసిసి అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా ఎంజీఎం కూడలిలో రేవంత్ రెడ్డి పాదయాత్ర డిసిసి అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన, మాజీ మంత్రి కొండా దంపతుల సమక్షంలో మంగళవారం సాయంత్రం కొనసాగింది. యాత్రలో బాణసంచా తరజువ్వలు వెలుగులు ఆకాశంలో విరజిల్లాయి.పోచమ్మ మైదాన్ కూడలి నుండి వరంగల్ చౌరస్తా నుండి గుర్రం బగ్గీ లో పోస్టు ఆఫీస్ కూడలికి చేరుకున్నారు. టిపిసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కి గజమలను వేశారు. అంతరం కాంగ్రెస్ యువ నాయకురాలు సుస్మిత పటేల్ మాట్లాడుతూ వరంగల్ తూర్పులో కొండా సురేఖను గెలిపించుకోవడం సురక్షితమన్నారు. అనంతరం మాజీ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వరంగల్ తూర్పుకు రావడంతో ఎర్రబెల్లి దయాకర్ లాగుల తడిసిపోయాయని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ ఒక్క తల్లి తండ్రికి పుట్టినాను. ఎప్పటికీ టిడిపిని వీడనని అన్నారు. ఇప్పుడు ఎందుకు ఎర్రబెల్లి దయాకర్‌రావు టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో ఎందుకు కలిశారని అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే తూర్పులో అభివృద్ధి జరిగిందని అన్నారు. సర్వేలన్నీ కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పుంటే దాడులు, దౌర్జన్యాలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అనంతరం టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కొండ సురేఖ మురళి నేతత్వంలో తూర్పులో కాంగ్రెస్ జెండా ఎగరడంఖాయమన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న చారిత్రాత్మకమైన వరంగల్ సమ్మక్క-సారక్క తిరుగుబాటు ఉంది అతిరథ మహనీయులు దేశనిర్మాణంలో తమవంతుపాత్ర పోషించారు. కానీ 2014 లో వరంగల్‌కు గ్రహణం పట్టింది. కొత్తవాడ పద్మశాలీలునేసిన దర్రిస్ నగిషి లకు గొప్పపేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీలో నియామకం బోధన సిబ్బంది లేరు మౌలికమైన వసతులు కరువయ్యాయి అన్నారు. ప్రభుత్వ భూములు చెరువుల ప్లాట్లను బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్లు కబ్జా చేస్తున్నారు. విచక్షణ రహితంగా దాడులు చేస్తున్నా రు. వందలాది బిడ్డలు ఆత్మబలిదానం చేసి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుంటే ఎమ్మె ల్యేలు భూకబ్జాలు చేసి కోట్లకు పడగ ఎత్తుతున్నారన్నారు.

దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఇంటికో ఉద్యోగం అని డబుల్ బెడ్ రూమ్ లు ఇస్తామని హామీలు హామీలిచ్చి కేసీఆర్ మోసం చేశాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంవత్సరంలోపు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. బెల్ట్ షాపులను రద్దు చేస్తాం దీపంపథకం అమలు చేస్తాం. రూ.500 కు గ్యాస్ సిలిండర్ ఇస్తాం. ఉద్యోగులందరికీ పాత స్కీం పద్ధతిలో పెన్షన్లు అమలు చేస్తాం న్యూ పెన్షన్ రద్దు చేస్తాం. పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇస్తాం, రూ.2 లక్షల వరకు రైతులకు రుణ మాఫీ చేస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ములుగు ఎమ్మెల్యే సీతక్క తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుభాషిని దేవి సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలవేసి, మాతభాషా దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఎం జె బి పి లో విద్యార్థులచే భువన విజయం ప్రదర్శనను నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చింత నెక్కొండ గ్రామం విజ్ఞాన భారతి విద్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో బాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం పద్యాలు చదవడం, కవితలు రాయడం, కథలు చెప్పడం మొదలగు అంశాలలో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అక్కినపెల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ సరైన భావ వ్యక్తీకరణకు మాతృభాష ఎంతో అవసరమన్నారు. ఇతరభాషలు ఎన్ని నేర్చు కున్నా మాతృభాషను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, సుమలత, పాషా, సంపత్ బిక్షపతి, నవీన్, శ్రీకాంత్, సరిత, శిరీష మౌనిక, పద్మావతి రాజేశ్వరి ఇతరులు పాల్గొన్నారు.

ఎన్జీవోస్ కాలనీ : 24వ అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని వడ్డేపల్లిలోని పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో (స్వయంప్రతి) మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు లెఫ్టినెంట్ ఆచార్య బత్తిని చంద్రమౌళి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకునూరి విద్యాదేవి ముఖ్యవక్త గా పాల్గొన్నారు. అధ్యక్ష ఉపన్యాసంలో ఆచార్య బి.చంద్రమౌళి మాట్లాడుతూ ప్రస్తుత పోటీప్రపంచంలో ప్రపంచీకరణ వేగంగా జరుగుతున్న విధానంలో ఇతర భాషలను తప్పని పరిస్థితుల్లో నేర్చుకోవలసి వస్తుందని తెలుపుతూ అవసరానికి పరభాషలను మాట్లాడినప్పటికీ మన మాతృభాషను మాత్రం మనం ఎప్పటికీ అశ్రద్ధ చేయవద్దని తెలిపినారు. ముఖ్య వక్తగా వచ్చిన డాక్టర్ ఆకునూరి విద్యాదేవి మాట్లాడుతూ మాతృభాషలో అధ్యయనం వలన మెదడు వికసించి జ్ఞానాభివృద్ధి అవుతుందని, ఎవరి మాతృభాష వారిదని, అందరి భాషలను గౌరవించాలని సూచిం చారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్యామల మాట్లాడుతూ తెలుగు భాషలోని పలుకుబడులను, నుడికారాలను వివరించి, మాతభాషగా తెలుగు గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. సుహాసిని, పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ బి.రామకష్టారెడ్డి, డాక్టర్ రేణుక, శిరీష, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మాధవి, డాక్టర్ డి.పార్వతి, హిందీ విభాగాధిపతి డాక్టర్ అనంతలక్ష్మి, తెలుగు సహాయచార్యులు డాక్టర్ కపిల భారతి, శ్రీమతి ఎస్.రజిత, డాక్టర్ విజయలక్ష్మి, టి.రజిత, విద్యార్థినులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి గణాంకశాఖ క్విజ్ పోటీలు

నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జరిగిన జాతీయ స్థాయి గణాంక శాఖ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ గణాంక శాఖ- హైదరాబాద్, ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. సతీష్ ,హనుమకొండ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి. సత్యనారాయణ రెడ్డి, వరంగల్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.జీవరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 40 బృందాలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణాంకశాఖ-హైదరాబాద్, ప్రాంతీయకార్యాలయ డిప్యూటీడైరెక్టర్ జనరల్ సతీష్ మాట్లాడుతూ సామాజిక-ఆర్థిక విధానాల ప్రణాళిక ,ప్రభుత్వ పాలన మెరుగు పరచడంలో గణాంకాలు ఎంతో కీలకపాత్రలు పోషిస్తాయని తెలిపారు. హనుమకొండ, వరంగల్ ముఖ్య ప్రణాళిక అధికారులు బి.సత్యనారాయణ రెడ్డి, జీవరత్నం మాట్లాడుతూ గణాంకాలు బిగ్ డేటా, డాటా అనాలసిస్ ప్రపంచ అభివద్ధికి ఎలా దోహదపడతాయో, గణాంకశాఖ ప్రాముఖ్యత బాలికల అభ్యున్నతి పై వివరించారు. వరంగల్ ఉప ప్రాంతీయ కార్యాలయ సీనియర్ అధికారి అవయ కుమార్ సాహెూ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇలాంటి విజ్ఞాన పరీక్షలకు హాజరై పోటీతత్వాన్ని మెరుగు పరచుకోవాలని ఆకాంక్షించారు.ఈ పోటీ పరీక్షలను రెండు దఫాలుగా నిర్వహించారు.

అనంతరం ఈ పోటీల్లో వాగ్దేవి కళాశాల నుండి సుష్మిత, హేమంత్ లు ప్రథమ స్థానంలోనూ, మాస్టర్ జీ కళాశాల నుండి అక్షయ్, హర్షిణి లు ద్వితీయ స్థానంలోనూ, భారతి కళాశాల నుండి ఆస్మ శ్రీవిద్య లు తతీయ స్థానంలోనూ విజేతలుగా నిలిచారు. వీరికి గణాంక శాఖ- హైదరాబాద్, ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సతీష్ గారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు బిక్రమ్ సింగ్, నరసింహాద్రి, దిలీప్ కుమార్, విమలేష్ కుమార్, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి



నవతెలంగాణ-కాజీపేట

పారిశ్రామిక ప్రాంతాలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి అన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికుల సర్వే లో భాగంగా సిఐటియూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట, రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో పారిశ్రామిక కార్మికుల స్థితిగతులపై మంగళవారం సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలోని పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, ఇండ్లు లేని నిరుపేద కార్మికులకు ప్రభుత్వమే ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లనిర్మాణం నిర్మాణం చేపట్టాలన్నారు, వలస కార్మికులకు సంబంధించిన చట్టాలను అమలు చేయాలి, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలో, తెలంగాణ ఏర్పడిన తర్వాత కార్మికుల వేతనాలను సవరించడం లేదని, ఇటీవల కాలంలో ఐదురంగాలకు రాష్ట్రప్రభుత్వం కనీసవేతనాలు సవరించినప్పటికీ యజమాన్యాల ఒత్తిడితోపక్కన పెట్టారన్నారు. పరిశ్రమలో దాదాపు సగానికంటే మించి వలస కార్మికులతో పనిచేస్తున్నారని 8గంటల పనికి బదులు 12 గంటల పని అమలు జరుగుతుందని, ప్రభుత్వం వెంటనే పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులకు చట్టాలన్నీ అమలు చేసే విధంగా లేబర్ అధికారులపై బాధ్యత పెరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గడ్డం అశోక్, భద్రయ్య, రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-శాయంపేట



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 23న నిర్వహించనున్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు మండలం నుండి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్పర్సన్, భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రైతువేదికలో టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు సన్నాహక సమావేశం మంగళవారం పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ ఈనెల 23న జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో పలు అభివద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖమంత్రి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పాల్గొంటున్నారని, అనంతరం అంబేద్కర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు మండలం పరిధిలోని గ్రామాల పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ మారేపల్లినందం, సర్పంచ్ కందగట్లరవి, ఎంపిటిసి బాసాని చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గండ్ర పరామర్శ

మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పెంబర్తి సాంబయ్య తండ్రి కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. మంగళవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సందర్శించి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే సర్పంచ్ పెంబర్తి సంతోష మల్లేష్, ఉపసర్పంచ్ సతీష్, పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, పెంబర్తి వినయ్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి పరీక్షల సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

హనుమకొండ డీఈవో మహ్మద్ అబ్దుల్ హై

నవతెలంగాణ-సుబేదారి

ఎస్ఎస్‌సి పరీక్షల సందేహాల నివత్తి కోసం విద్యార్థులు కాల్ చేసి తెలుసుకోవచ్చు హనుమకొండ డీఈవో మహ్మద్ అబ్దుల్‌హై పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 3 నుండి జరగనున్న పదవ తరగతి పబ్లిక్‌పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రశ్న పత్రాలపై కలిగే సందేహాలను నివృత్తి చేసేందుకు సంబంధిత విషయబోధకులతో ఫోన్ ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో 11 ప్రశ్నాపత్రాలు ఉండంగా ఈసారి ఆరుపేపర్లు మాత్రమే రాయవలసి ఉండగా ప్రశ్నపత్రాలుపై ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే వాటిపై తగిన అవగాహన కల్పిస్తామని తెలిపారు. అన్ని సబ్జెక్టుల్లో 80 మార్కులు ప్రశ్న పత్రాలు ఉండగా సామాన్య శాస్త్రంలో, భౌతిక జీవశాస్త్రాలకు 40 మార్కుల చొప్పున ఒకేరోజు రెండు వేర్వేరు జవాబు పత్రాలతో రాయవలసి ఉంటుందన్నారు. సందేహాల నివృత్తికి ఈ క్రింది ఫోన్ నెంబర్లకు కాల్ చేయాలని అన్నారు. విద్యాశాఖ అధికారి 79950 87651, ఉమ్మడి వరంగల్ పరీక్షల బోర్డు కార్యదర్శి 9441 413172, తెలుగు పేపర్ కోసము 93911 99277, ఆంగ్ల భాష పేపరు కోసము 9959323075, గణితం 9849431543, భౌతిక శాస్త్రం 9866856373, జీవశాస్త్రం 9849500462,సాంఘిక శాస్త్రం కోసం 8019824250 ఈ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చు అని అన్నారు.

రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం

రోడ్డుపై నడుస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ సాగిన యాత్ర



నవతెలంగాణ-మట్టెవాడ

హాత్ సే హాత్ జోడోయాత్రలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అడుగుపెట్టిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం ఐదున్నరకు వరంగల్ ఎంజీఎం కూడలిలో ప్రారంభమైన యాత్ర ఫర్ చేంజ్‌కు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు . కొండ మురళి సురేఖల ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్ రెడ్డికి గజమాలతో సత్కరించి పుష్పాలు చల్లుతూ టపాసులు పేల్చి ఘన స్వాగతం పలికారు. ఎంజీఎం కూడలిలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలతో కలిసి యాత్రలో భాగంగా గోపాలస్వామి టెంపుల్, పోచం మైదాన్ మీదుగా చౌరస్తా వరకు రోడ్డు పైనడుస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. రేవంత్‌రెడ్డికి పోలీసులు ఇరుపక్కల రోప్‌తో రక్షణఏర్పాట్లు చేయగా నడుచుకుంటూ పోస్టఆఫీస్ కూడలిలో ఏర్పాటు చేసిన సమా వేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కెసిఆర్ తప్పిన విధానాన్ని ప్రజలకు అర్థమయ్యేలా విమర్శనాస్త్రాలను సంధించారు.ఈ కార్యక్రమంలో నాయిని రాజేందర్ రెడ్డి, కొండా సుస్మిత పటేల్, సిరిసిల్ల రాజయ్య, మడిపల్లి కష్ణ తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత: ఏఎస్సై

నవతెలంగాణ-పెద్దవంగర

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని మోత్య తండాలో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం ప్రాంతానికి చెందిన సెట్టిపి భాస్కర్ రెడ్డి తన బొలేరో వాహనంలో అక్రమంగా 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులకు పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని రూ. 40 వేలు విలువ చేసే బియ్యం, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

25న జాబ్ మేళా : జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 25న ప్రైవేటు రంగంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సాకేత్ హెచ్‌ఆర్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ టెక్నిషియన్ (50), వెల్డర్స్ (30), టర్నర్స్ (10), అసెంబ్లీ ఆపరేటర్స్ (60) ఖాళీలు ఉన్నాయని, అసిస్టెంట్ టెక్నిషియన్‌కు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, వెల్డర్స్‌కు, టర్నర్స్‌కు, అసెంబ్లీ ఆపరేటర్స్‌కు ఐటిఐ విద్యార్హతలుండాలని, ఆసక్తి, అర్హత ఉన్న యువతీ యువకులు 25న ఉదయం 11 గంటల నుండి 12.30 లోపు జిల్లా కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రూం.1లో హాజరు కావాలని ఆమె సూచించారు. మిగతా వివరాలకు సీనియర్ సహాయకులు జె.గీతను సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్‌లో పోస్టల్ ఖాతా ఓపెన్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఈనెల 20 నుండి 24 వరకు తపాలశాఖ పోస్టల్ మహామేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా పోస్టల్ అసిస్టెంట్ సూపరిండెంట్ మూల రమాదేవి మంగళవారం ఒక ప్రకటకలో తెలిపారు. ప్రజలకు మరింత చేరువకు తపాల శాఖ అడుగులు వేస్తుందని, ఈ మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఇప్పటికే వివిధ రకాల స్కీములతో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న తపాల శాఖ వారికి మరింత చేరువయ్యేందుకు నడుం బిగించిందని పేర్కొన్నారు. పోస్టాఫీస్‌కు వెళ్ళకుండానే ఉంటి వద్దనే ఉండి పోస్టల్ ఖాతా ఓపెన్ చేయాలనుకునే వారు పోస్ట్ ఇన్‌ఫో-అండ్రాయిడ్ ఐఏస్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని చిరునామాను ఇతర వివరాలను నమోదు చేస్తే పోస్టుమెన్ ఇంటికి వచ్చి ఖాతా తెరుస్తాడని ఆమె వివరించారు. ఈ ఖాతాకు ఎలాంటి డిపాజిట్ లేదని పేర్కొన్నారు.

సీడీఎఫ్ నిధులతో అంతర్గత రోడ్ల నిర్మాణం

నవతెలంగాణ-జఫర్‌గడ్



మండలంలోని తిమ్మంపేట గ్రామంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మంజూరు చేసిన 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం సర్పంచ్ మంద మల్లయ్య ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ నిధులతో గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రానున్న కాలంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పరుస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఇల్లందుల శ్రీనివాస్, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ కుంభోజి శ్రీనివాస్, పెండ్లి శ్రీనివాస్,వార్డుమెంబర్లు మండల ప్రభాకర్, సింగిరెడ్డి రవీందర్, ఎల్లయ్య, నరసింహులు, నర్సయ్య పాల్గొన్నారు.


అభివృద్ధిలో భాగస్వాములు కావాలి : సర్పంచ్

నవతెలంగాణ-చిన్నగూడూరు

గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సర్పంచ్ శిరీష మంగీలాల్ అన్నారు. మంగళవారం మండలంలోని పగిడిపల్లి గ్రామంలో పలు అంతర్గత రోడ్డు పనులను బీఆర్ఎస్ మండ అధ్యక్షులు రామ్ సింగ్, నాయకులు మూల మురళీధర్ రెడ్డిలతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్రం సిద్ధించాక అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో ముందుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ధారా సింగ్, కేసముద్రం మార్కెట్ మాజీ డైరెక్టర్ చెన్నయ్య, కేసముద్రం మార్కెట్ డైరెక్టర్ శ్రీరాములు, వార్డు సభ్యులు గంధసిరి సింధుజ శ్రీపాల్, నాయకులు వెంకన్న, మల్లయ్య బాలమల్లు, రమేష్, రవీందర్, యాకయ్య బిక్షం రెడ్డి, రాంరెడ్డి, రాముడు, కార్యదర్శి రోజా తదితరులు పాల్గొన్నారు.



మాతృభాష జీవన వికాసానికి దోహదం చేస్తుంది







నవతెలంగాణ-మహబూబాబాద్

మాతృభాషలో భోధన,రచనలు మానవ జీవన వికాసానికి దోహదం చేస్తాయి అని శుభోదయం సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక బ్యాంక్ కాలనీలోని శుభోదయం కార్యాలయంలో శుభోదయం ఉపాధ్యక్షుడు టి.నరేందర్ అధ్యక్షతన జరిగిన కార్ర్యమంలో శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ మాతృభాష తల్లి వంటిదని మాతృభాషలో ప్రతిభా పాటవాలు ఉంటే అన్యభాషలో ప్రావీణ్యం సంపాదించటం సులువు అని తెలిపారు. ప్రపంచ స్థాయి సాహితీవేత్తలు తమ మాతృభాషతో పాటు ఇతర భాషలలో ప్రావీణ్యం సంపాదించినవారే అను తెలిపారు.పివి నరసింహారావు, ఎన్‌టి.రామారావు, రవీంద్రనాథ్ ఠాగూర్, కెఆర్ నారాయణ్, సరోజినీదేవీ, అబ్దుల్ కలామ్ వంటి వారు దీనికి ఉదాహరణ అని తెలిపారు.1999లో బంగ్లాదేశ్ చేసిన డిమాండ్ మేరకు యునెస్కో నాటినుండి ఫిబ్రవరి 21వ తేదీను అంతర్జాతీయ మాతృభాష దినత్సవం జరుపుతున్నారని తెలిపారు.దేశంలో సాంకేతిక విద్యలో, విశ్వ విద్యాలయ స్థాయిలో తెలుగుతో పాటు ఇతర ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ భాషా అభివృద్ధి మంత్రిత్వ శాఖ లేదా బోర్డును ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శుభోదయం ప్రతినిధులు లక్ష్మి కాంతారావు, బొడ్డుపల్లి పాపయ్య, కె.జనార్ధన్, సంపత్, రమేష్, ఆచార్య కవిత, మాధవి, కీర్తనారెడ్డి, భూమిక, అఖిల పాల్గొన్నారు.

దేవరుప్పుల : మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రానికి చెందిన శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మాతృభాష దినోత్సవ శుభాకాంక్షలు అక్షర రూపంలో కూర్చొని మాతృభాష అభిమనాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరపాంటెండెంట్ టకూ రి పాండుకృష్ణ, ప్రిన్సిపల్ స్వప్న పాల్గొన్నారు.

జఫర్‌గడ్ : మంగళవారం మండలం కేంద్రంలోని మోడల్ స్కూల్ నందు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు విభాగ బాధ్యులు కట్కూరి డాక్టర్ మహేందర్, భూక్య నరేష్, ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపన్యాసం, తెలుగు హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.అమ్మ భాషనే మాతృభాష అనే అంశంపై శ్రీ గణేష్ కందగట్ల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఉపన్యాసం ఇచ్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ డీ.శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు మాతృభాషలో నైపుణ్యం సాధించాలని తెలిపారు. ఏ భాషను అర్థం చేసుకోవాలన్న మాతృభాషయేప్రధానమనీ వివరించారు. ఈ కార్యక్రమంలో జానీ, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, మనోజ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



కేసముద్రం రూరల్ : ఇనుగుర్తి మండల కేంద్రంలో సాంఘీక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ అధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్ర్యమంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీ, చిత్రీకరణ పోటీలు నిర్వహించి ప్రిన్సిపల్ రూపాస్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా డాక్టర్ శివరాం, ఆర్‌బిఎస్‌కే బృందం పెద్దలు, మహబూబాబాద్, తెలుగు ప్రదర్శనశాలను సందర్శించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపల్ బి. వెంకయ్య, తెలుగు ఉపాధ్యాయులు ఎస్.స్వప్న, వి.వెంకమ్మ, టి.సంగీత మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల అభివృద్ధికి కృషి చేయాలి : సంజీవ రావు

ఇంటికన్నే గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ మహాసభ



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

అసమానతలు లేని సమాజం కోసం అంబేద్కర్ స్ఫూర్తితో సమానత్వంకై ప్రతీ ఒక్కరూ పాటుపడాలని, పాలక వర్గాలు బహుజనుల అభివృద్ధికి కృషి చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దళిత రత్న కామ సంజీవరావు అన్నారు. కేసముద్రం మండలం ఇంటికన్నే గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ మహాసభ అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా మహాసభలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కన్వీనర్ పోలేపాక నాగరాజు అధ్యక్షతన మహాసభ జరుగగా ముఖ్య అతిథిగా కామ సంజీవరావు మాట్లాడారు. అసమానతలు లేని సమాజం కోసం పాటుపడిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యంగం, ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్య పద్దతిలో పదవులను అనుభవిస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజ్యాంగ యుతంగా వచ్చే ఫలాలు వారి ఇంట్లో వెలుగులు నింపే విధంగా అందించాలన్నారు. స్వాతంత్ర్యం సిద్దించి 75 సంవత్సరాలు, రాజ్యంగం అమలులోకి వచ్చి 72 సంవత్సరాలు అవుతున్న దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలపై దాడులు ఆగడం లేదన్నారు. అంబేద్కర్ వాదం ద్వారానే దేశంలో నెలకొని ఉన్న అసమానతలను అడ్డుకోవచ్చన్నారు. రాష్ట్రంలో దళితులకు మూడేకారాల భూమి, దళిత బంధు ప్రతీ ఒక కుటుంబానికి ఇవ్వాలని, గిరిజన బంధును అమలు చేయాలని, బీసిబంధు ప్రకటించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కులకై కోటి ఉత్తరాల ఉద్యమ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సామల నర్సయ్య, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి కొలిపాక వెంకన్న, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఎన్ఎ.స్టాలిన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిరుడు సామేల్, జిల్లా ఉపాధ్యక్షులు మందుల కృష్ణమూర్తి, ఇంటికన్నే గ్రామ మాజీ సర్పంచ్ ఐతే సారయ్య, అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు చీపురు వెంకటేశ్వర్లు, మండల అడహక్ కమిటీ సభ్యులు మిట్టగడుపుల యాకయ్య, మిట్టగడుపుల బిక్షపతి, బానోతు బాలు నాయక్, సోమారపు మదర్, అంబేద్కర్ వాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటికన్నే గ్రామ కమిటీ

గౌరవ అధ్యక్షులుగా అయిత సారయ్య, అధ్యక్షులుగా బేజ్జం శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు గడ్డం దయాకర్, ఎండీ కుర్బాన్ అలీ, ప్రధాన కార్యదర్శిగా అయిత భరత్ కుమార్, కార్యదర్శులుగా మిట్టగడుపుల జీవన్ కుమార్, సోమారపు శశివర్ధన్, కోశాధికారి నిమ్మనగోటి సురేష్, కార్యవర్గ సభ్యులుగా మేడిపల్లి ఉమాపతి, చీపిరి కొమురయ్య తదితరులను ఎన్నుకున్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించిన విద్యార్థులు

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండల కేంద్రంలోని ఈ నెల 26న జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఉపాధ్యయుడు ఉప్పరోజు బ్రహ్మాచారిని పూర్వ విద్యార్థులు కలిశారు. పిఎసిఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్‌తో పాటు గుర్రపు బాలరాజు, వార్డ్ నెంబర్ కోడూరు మహాత్మచారి, సందెల బాల సిద్ధులును ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించడం జరిగింది.



మంత్రులను కలిసిన జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి

నవతెలంగాణ-జనగామ డెస్క్

బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఐటీ శాఖ మంత్రి వర్యులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు తాటికొండ రాజయ్యను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వంశీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7 జయశంకర్-భూపాలపల్లి, ములుగు
బుధవారం 22 ఫిబ్రవరి 2023

నేటి నుంచి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు నేటి నుండి 28వ తేదీ వరకు గ్రామాల వారిగా పంపిణీ చేస్తారని డాక్టర్ మల్లేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీన పెద్దంపేట, అంబటిపల్లి ఎనకపల్లి, 23న రాపెల్లి, కోటకిష్టరావుపేట, 24న బెగులూరు, ఎల్కేశ్వరం బొమ్మపూర్, 25న మహాదేవపూర్, కొదురుపల్లి, 26న అన్నారం, సెంటర్పల్లి, నాగపల్లి, 27న మద్దులపల్లి పలుగుల, కుంట్రం, 28న కాలేశ్వరం, మెట్పల్లి, ధీరసాగర్ గ్రామాలలో మందు పంపిణీ చేస్తారని తెలిపారు. ఆయా గ్రామాల గొర్రెల మేకల పెంపకదారులు అందుబాటులో ఉండాలని కోరారు.

పనికెళ్తేనే జాబ్ కార్డ్... లేదంటే రద్దే... !

ఆందోళనలో కూలీలు

డాటా బేస్‌తో జాబితా సిద్ధం

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఉపాధి పనికెళ్లకుంటే ఇక జాబ్ కార్డు రద్దు కానుంది. ఇంతకాలం పనికెళ్లినా.. వెళ్లకున్నా జాబ్ కార్డు మనుగడలో ఉండగా పలు పథకాలకు వినియోగించేవారు. కానీ, తాజాగా ఉపాధి పనులకు వెళ్లిన వారిని మాత్రమే కూలీలుగా పరిగణించనున్నారు. ఇందుకు కేంద్రం డాటా బేస్ ప్రకారం రోజువారీ కూలీల నమోదు క్రమంలో రెగ్యులర్‌గా వచ్చే కూలీలు ఎంతమందో సాఫ్ట్ వేర్ ద్వారా గుర్తిస్తూ మిగతా కార్డులు రద్దు చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీని ప్రభావం వేలమంది కూలీలపై పడనుంది.

మల్హర్‌రావు మండలవ్యాప్తంగా 15 గ్రామాలు ఉండగా 8,736మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. కాగా ఉపాధి కూలీల సంఖ్య 20,701గా నమోదు చేశారు. ందులో 13,756మంది పని చేస్తున్నారు. పని చేయని వారు 7,100మంది ఉన్నారు. అలాగే ఆధార్ అనుసంధానమైన కూలీలు 20,627మంది ఉన్నారు. మొత్తంగా 13,756 మంది మాత్రమే తరచూ పనులకు వెళ్తున్నారు. మిగతా వారంతా పనికి వెళ్లడం లేదని గుర్తించారు. వీరిలో జాబ్ కార్డు తీసుకున్న రోజు నుంచి ఇప్పటి వరకు ఒక్కరోజు కూడా పని చేయని వారిని పరిగణలోకి తీసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో పశువుల పాకలు, ఎండు కల్లాలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలకు జాబ్ కార్డు తప్పనిసరి చేశారు. ఆయా పనులు పూర్తికావడంతో వాటిలోనూ చాలా వరకు ఉపయోగంలో లేని కార్డులున్నాయి. వీరిలో కొందరికి రెండేసి జాబ్ కార్డులున్నాయి. పనులకు వెళ్లకుండానే స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల సహాయంతో హాజరు నమోదు చేసుకుంటూ కూలీలుగా చలామణి అవుతున్నవారు లేకపోలేదు. ఈ క్రమంలో ప్రతి కూలి జాబ్ కార్డును ఆధార్‌కు అనుసంధానం చేశారు. అయితే పని చేసే వారికే ఉపాధి హామీ అమలు చేస్తూ అక్రమాలకు తావివ్వకూడదని కేంద్రం భావిస్తుండడంతో కూలీలపై ప్రభావం పడనుంది.



బడ్జెట్‌లో కోత మరువకముందే...

పేదల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది.ఈ నెల 2 నాటికి 17 ఏళ్ళు పూర్తవ్వగా చాలా రకాల పనులు చేపట్టింది. కాలక్రమేణ పనికి రానివారు కూడా కూలీలుగా నమోదు చేసుకుంటుండగా ఇబ్బడిముబ్బడిగా కార్డులు జారీ చేశారు. కాగా ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో కోత విధించింది. అది మరువక ముందే పనికి వెళ్ళని కూలీలను తొలగించే ప్రక్రియను ప్రారంభించింది. దీని ప్రభావం వేలమంది కూలీలపై చూపనుంది.

యథేచ్ఛగా అక్రమ ఇసుక దందా ?

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మల్హర్‌రావు మండలంలో తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల, నాచారం, అన్‌సాన్ పల్లి, కొండంపేట, ఇప్పలపల్లి, కేశారంపల్లి, వల్లేంకుంట, కొయ్యూర్ గ్రామాల్లో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా జోరుగా కొనసాగుతోంది. దీంతో ఇసుక వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. అక్రమ ఇసుక రవాణ ప్రభుత్వం, సంబంధించిన అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ ఇసుక రవాణా కొనసాగిస్తున్నారు. రెవెన్యూ, ఫారెస్టు, పోలీస్, మైనింగ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు మండలంలోని తాడిచెర్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి సైట్ వద్ద అభివృద్ధి పేరుతో ట్రాక్టర్లతో డంపింగ్ చేసి రాత్రివేళల్లో అక్రమంగా లారీలలో లోడింగ్ చేస్తూ పట్టణాలకు తరలించి సొమ్ముచేసుకుంటుండడమే నిదర్శనం. ఈ అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులకు పలువురు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదనే అపవాదు ఉంది. అలాగే మల్లారం మానేరు పరివాహక ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మాణం రూ. 16.60 కోట్లతో చేపట్టిన గుత్తేదారు ఇటీవల ఆరేవాగు నుంచి వేసిన అక్రమ రహదారి నుండి అక్రమ ఇసుక దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. చెక్ డ్యాం నిర్మాణం పనుల కోసం గుత్తేదారు సామాగ్రిని తరలించేందుకు వేసిన మట్టి రోడ్డును అదనుగా భావించిన ప్రయివేటు ఇసుక వ్యాపారులు రాత్రి పగలు అనే తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్లతో అభివృద్ధి పనుల పేరిట అక్రమ ఇసుక దందా చేపడుతున్న పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకుని అక్రమ ఇసుక రవాణా కు అడ్డుకట్ట వేయకుంటే భూగర్భ జలాలు అడుగంటి పోయి రాబోయే వేసవిలో తాగు, సాగు నీటికి ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఈ దారి ఎటువైపు ?

మండలంలోని ఆరేవాగులో అనుమతులు లేకుండా అక్రమంగా రాత్రికి రాత్రే వేసిన ఈ మట్టి రహదారి ఎటువైపు వెలుతుందోనని సవాలక్ష ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. చెక్ డ్యాం గుత్తేదారు రాత్రికి రాత్రే వేసిన ఈ మట్టి రోడ్డు పై అడ్డు అదుపు లేకుండా అక్రమ ఇసుక దందా జోరుగా నడుస్తున్నట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి రోడ్డు వేసింది అక్రమ ఇసుక తరలింపునకా?.. చెక్ డ్యాం నిర్మాణ సామగ్రి తరలింపునకా అనే స్పష్టత లేక పోవడం గమనార్హం.



విద్య దానాన్ని మించిన దానం లేదు

రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్య దేవ్ సింగ్

నవతెలంగాణ-గోవిందరావుపేట

విద్య దానాన్ని మించిన దానం మరొకటి లేదని విశ్రాంతి మున్సిపల్ కమిషనర్ ప్రజా సేవకులు భూక్య దేవ్ సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు), కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ పాఠశాలల్లో పదవ తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులకు దేవ్‌సింగ్ ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవ్ సింగ్ మాట్లాడుతూ ములుగునియోజకవర్గ విద్యార్థులకు భవిష్యత్‌లో మరిన్ని సేవలందిస్తానని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నతమైన స్థానంలో ఉంటారని అన్నారు. ఇతరులకు మార్గదర్శకంగా ఉండేందుకు కార్యాచరణ ప్రణాళిక ఉండాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ తో పాటుగా జ్యూట్ బ్యాగ్స్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త దొంతి విజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ట్రస్మా భూపాలపల్లి నియోజకవర్గ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గణపురం

ట్రస్మా తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ భూపాలపల్లి నియోజకవర్గస్థాయి ఎన్నికలు ఆదివారం భూపాలపల్లిలో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆకుల రమేష్, కార్యదర్శిగా జి సతీష్, కోశాధికారిగా పి జోసెఫ్, ఉపాధ్యక్షుడిగా పబ్బ శివశంకర్, సంయుక్త కార్యదర్శిగా ఎండి ఫిరోజ్ ఖాన్, ఈసీ మెంబర్లుగా జి సతీష్, ఎం సురేష్, కే అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికకు సహకరించిన భూపాలపల్లి ని యోజకవర్గంలోని ప్రతి స్కూల్ కరస్పాండెంట్‌కు ఎన్నికల నిర్వహణ అధికారులు దేవేందర్‌రెడ్డి, ఎంబా రాజ్ మహమ్మద్, జిల్లా అధ్యక్షులు ఉడుత సాంబయ్య, జిల్లా కోశాధికారి ఎన్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు



బాధితులకు అండగా తాడి కార్పొరేషన్

నవతెలంగాణ-చిట్యాల

గీత కార్మిక బాధితులకు అండగా తాడి కార్పొరేషన్ నిలుస్తుందని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ అన్నారు. మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మాదారపు రవీందర్‌గౌడ్, కోటంచ గ్రామానికి చెందిన గైని సాంబయ్యగౌడ్ వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని ప్రభాకర్ గౌడ్ , సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్స్ గోపి గౌడ్, తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు స్పందించి తాడి కార్పొరేషన్ ద్వారా ఆరోగ్య ఖర్చుల నిమిత్తం కోసం రూ.లక్ష 50 వేల చెక్కులను మంజూరు చేశారు. మంగళవారం గౌడ సంఘం నాయకులు స్థానిక సర్పంచులు కసిరెడ్డి సాయి సుధా రత్నాకర్ రెడ్డి పబ్బ శ్రీనివాస్‌తో కలిసి బాధితుల ఇంటికెళ్లి చెక్కులను అందజేశారు కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి క్రాంతి కిరణ్, అధ్యక్షులు ఏరుకొండ సంపత్‌గౌడ్, జై గౌడ జిల్లా అధ్యక్షులు బొమ్మ శంకర్‌గౌడ్, బుర్ర రమేష్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు బుర్ర శ్రీధర్‌గౌడ్, పెరుమాండ్ల రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-చిట్యాల

మండల కేంద్రానికి చెందిన అంకం స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా చిట్యాల పద్మశాలి వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మంగళవారం సంఘం అధ్యక్షుడు ఈగ కోటేశ్వర్, సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సామల రాజేందర్, ఆడిట్ సభ్యుడు చిప్ప విశ్వనాథం, క్యాతం మార్కండేయ, కందుల రమేష్, అంకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాటి కృష్ణ పరామర్శ

నవతెలంగాణ-మంగపేట

మంగపేట మండల పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ గొప్ప చంద్రయ్య, రమణక్కపేటలో బీజేపీ కార్యకర్త పయ్యావుల సత్యం భార్య భద్రమ్మ, మల్లూరులో షేక్ తాజుద్దీన్ కుమారుడు యాకుబ్, శనిగకుంటలో తోలెం ద్రౌపది, తిమ్మంపేటలో లొట్టి శ్రీను మృతిచెందారు. మంగళవారం బాధిత కుటుంబాలను బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె జనార్ధన్, నాయకులు ముగులుట్ల సత్యనారాయణ, గద్దల రఘు, కోరెం నర్సింహులు, దంతెనపెల్లి నరేందర్, ముత్తేబోయిన నర్సింహారావు, రతన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

భూపాలపల్లి, ములుగు జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

నవతెలంగాణ-గోవిందరావుపేట

గిరిజన బంజారాల ఆరాధ్య దైవం అయిన సేవాలాల్ జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని భూపాలపల్లి ములుగు జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కమ్మ సేవ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. గిరిజన,బంజారాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప నాయకుడు సంత్ సేవాలాల్ అని కొనియాడారు. సేవాలాల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాం నాయక్, గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, బంజారా ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



16 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు

నవతెలంగాణ-కోల్ బెల్ట్

భూపాలపల్లి జయశంకర్ జిల్లా కేంద్రంలోని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం జీఎం బళ్లారి శ్రీనివాసరావు 16 మందికి(13 పురుషులు,3 స్త్రీలు) కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగం పొందడం గొప్ప అదృష్టమని, అవకాశాన్ని అందిపుచ్చుకొని క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి సహకరించాలని కోరారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎం(పర్సనల్) అండ్ చీఫ్ ఆఫ్ సెక్యూరిటీ బి హనుమంతురావు, ఎస్ఓ-టు జీఎం వెంకటయ్య, ఏజీఎంలు ఎస్ జ్యోతి, ఎన్ రామలింగం, కేటికే ఓసీ-టు ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్రాంరెడ్డి, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారం, పర్సనల్ మేనేజర్ శివ కేశవరావు, ఫైనాన్స్ మేనేజర్ సురేఖ, సీనియర్ పీఓలు క్రాంతికుమార్, శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కంటి చూపు ప్రజలకు ఎంతో ఉపయోగకరం

దేవగిరి పట్నం సర్పంచ్ ఇన్నారెడ్డి

నవతెలంగాణ - ములుగు

కంటి చూపు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ ఇన్నారెడ్డి అన్నారు. ములుగు మండలం రాయినిగూడెం పిహెచ్ సి పరిధిలోని దేవగిరిపట్నం గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్యాంపుకు వసతుల ఏర్పాట్లు చేసి వారు మాట్లాడారు. కంటి వెలుగును ప్రజలందరూ వినియోగించుకుని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సిరాజుద్దీన్, ఆప్తమాలిక్ వినయ్, డీఈవో మమత, హెల్త్ సూపర్వైజర్ ఉష, పంచాయతీ కార్యదర్శి నిరంజన్‌రెడ్డి. ఏఎన్ఎంలు పూల్ బంద్, సమ్మక్క, ఆశాలు విజయ, సమ్మక్క, సుజాత, వజ్ర పాల్గొన్నారు.

మడకం జ్యోతికి డీఎంహెచ్ఓ పరామర్శ

నవతెలంగాణ- ములుగు



ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మడకం జ్యోతిని గత ఐదు రోజుల్లో రెండవసారి మంగళవారం డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, గుడిసెల వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, ఎంసీహెచ్ పీఓ డాక్టర్ పవన్‌తో కలిసి పరామర్శించీరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జ్యోతి పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని పర్యవేక్షరిస్తున్న వైద్య బృందం తెలిపారన్నారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వైద్య నిపుణులతో సమావేశమై వైద్య సేవలపై చర్చించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఏం డోకా లేదు.. మేము చూడగలం

ములుగు జిల్లాలో కంటి వెలుగును వినియోగించుకుంటున్న ప్రజలు

20 బృందాలతో కంటి పరీక్షలు

ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్ కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ - ములుగు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో ములుగు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కంటి దగ్గర చూపు.. దూరం చూపు... ఇబ్బందిగా ఉండే తమకు కంటి అద్దాలు కంటి వెలుగులో ఇచ్చారని, దీంతో తమ కళ్లకు డోకా లేదని పేర్కొంటున్నారు. ములుగు జిల్లాలోని 9 మండలాల్లో 174 గ్రామపంచాయతీల్లో 3,30,031 జనాభా ఉంది. ఇందులో 18 సంవత్సరాలు పై బడిన జనాభా 2,08,000 మంది ఉన్నారు. వీరందరికి కంటి పరీక్షలు నిర్వహించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 15 పీహెచ్‌సీల్లో 20 బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 68059 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న 9312 మందికి అక్కడిక్కడే రీడింగ్ గ్లాస్‌లు అందించారు. ప్రత్యేక అద్దాలు అవసరం ఉన్న మరో 6155 మందికి అద్దాలను అందించేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఇందులో 1392 ప్రత్యేక అద్దాలను ములుగు వైద్య ఆరోగ్య శాఖకు పంపించారు. దీనిలో 661 ప్రత్యేక అద్దాలను అవసరం ఉన్న వారికి అందించారు. అద్దాలతో పాటు కంటికి సంబంధించి ఎదురవుతున్న చిన్న చిన్న సమస్యలకు మందులతో పాటు చుక్కల మందులు పంపిణీ చేస్తున్నారు.



కంటి వెలుగు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 19 నుంచి జూన్ 15 వరకు 100 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఎస్ కృష్ణ ఆదిత్య ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆయన పర్యవేక్షణలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పలు శాఖల అధికారులతో సంయుక్తంగా కలిసి శిబిరాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులతో కంటి వెలుగు శిబిరాలను తనిఖీలు చేపడుతున్నారు. శిబిరాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ములుగు జిల్లాలో ప్రజలు కంటి పరీక్షలకు వేగవంతంగా హాజరవుతున్నారు. పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో ప్రత్యేక షెడ్యూల్‌ను రూపొందించుకొని జీపీ కార్యాలయాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు సోమవారం నుంచి శుక్రవారం వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో కలంటి వెలుగు వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది.

చుక్కల మందులు, అద్దాలు ఇచ్చిండ్రు



నా పేరు పెద్దల రమ నాకు ముగ్గురు అమ్మాయిలే. కొడుకులు లేరు. నాకు దగ్గర చూపు కనపడకపోయేది,. కంటి వెలుగు ద్వారా పరీక్షలు చేయించుకుంటే ఉచితంగా చుక్కల మందులు అద్దాలు ఇచ్చింద్రు. దీంతో నా సమస్య తీరింది.

-పెద్దల రమ, వృత్తి కూలి, శ్రీనివాస కాలని

పేదలకు ఎంతో ప్రయోజనం



నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయ. నా భార్త చనిపోయాడు. ప్రస్తుతం 53ఏండ్లున్న నాకు కంటి సమస్య కొద్ది నెలల నుండి ఉంది. డబ్బులు లేక ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకోలేదు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా మందులు అద్దాలు ఇచ్చారు. దీంతో కంటి సమస్య తీరింది. కంటి వెలుగు కార్యక్రమం మాలాంటి పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోంది.

- హశ్మత్, గడిగడ్డ, ములుగు

కంటివెలుగు మంచి కార్యక్రమం



ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపట్టింది ఉచితంగా కంటి పరీక్షలు చేసి అద్దాలు ఇవ్వడం చాలా సంతోషం. ప్రైవేటు దవఖానాలో ఐతే శానా పైసలు అయితుండే. ఈ కంటి వెలుగు లో మందులు, అద్దాలు ఉచితంగా ఇచ్చారు.

- అచ్చ సాంబయ్య, బంజారా కాలనీ

ఎంఐ స్టోర్‌ను ఎమ్మెల్యే సీతక్క ప్రారంభం

నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా పట్టణంలో ప్రోపరేటర్ ప్రశాంత్ రెడ్డి ఏర్పాటు చేసిన ఎంఐ స్టోర్ ను ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క మంగళవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఆకు తోట చంద్ర మౌళి,బండి శ్రీనివాస్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షకీల్, ఎంపీటీసీ మవురపూ తిరుపతి రెడ్డి, సర్పంచ్ ఎండీ అహ్మద్ పాషా, పసుల సాంబయ్య మండల మాజీ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు పాలడుగు వెంకట కృష్ణ,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పేండం శ్రీకాంత్, మేడం రమణకర్ పాల్గొన్నారు.



కోమల్‌ప్రీత్ కౌర్‌కు సన్మానం

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ పోలిస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం సీఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కోమట్రీట్ కౌర్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 2023 జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఉత్సవాలలో ఉత్తమ శకట ప్రదర్శన 'నారీశక్తి -సీఏపీఎఫ్'కు నేతృత్వం వహించి జి 58 సీఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కోమల్ ప్రీత్ కౌర్ మొదటి బహుమతి పొందాడు. కాగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్పూర్ ఎస్ఐ రాజ్‌కుమార్, కాళేశ్వరం ఎస్సై లక్ష్మణరావు, పలిమెల ఎస్సై భీమన్న, సీఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్లు రమణారెడ్డి మురళి దహరాన్, సబ్ ఇన్‌స్పెక్టర్లు మనోహరన్, పోలిస్, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధిని పట్టించుకోని సీఎం కేసీఆర్

బీజేపీ రాష్ట నాయకులు రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ - ములుగు

కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం రాష్ట్ర అభివృద్ధిని ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బండారుపల్లి గ్రామంలో బిజెపి భరోసా కార్నర్ సభ బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ అధ్యక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ నిరంకుశల పాలనలో ప్రజలందరూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు." కుటుంబాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ములుగు నియోజకవర్గంలో బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలోని అత్యధిక వెనుకబడిన నియోజకవర్గంగా ములుగు ఉందన్నారు. ప్రభుత్వ హామీలు ఒక్కటి నెరవేర్చలేదన్నారు. 2014లో వాగ్దానం చేసిన 2.8 లక్షలకుగాను 4శాతం లబ్దిదారులకు మాత్రమే డబులు బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం వస్తే ఉచిత విద్య, వైద్యం,ఇంట్లో అర్హులందరికీ పెన్షన్ తదితరవి అమలు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కారదర్శి నగరపు రమేష్, ములుగు అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా కార్యదర్శి శీలమంతుల రవీంద్ర చారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొంతిరెడ్డి రాకేష్ రెడ్డి, బూత్ అధ్యక్షులు వైనాల సంపత్, చంద్రగిరి బిక్షపతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు శిక్ష

నవతెలంగాణ-మహాదేవపూర్

అత్యాచారం చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసి జైలు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని జిలాల కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బంది వరలక్ష్మి, కానిస్టేబుల్ భిక్షపతి ని ఎస్పీ సురేందర్‌రెడ్డి మంగళవారం అభినందించారు. భూపాలపల్లి సెషన్స్ జిల్లా కోర్టు జడ్జి నారాయణ బాబు బాధితులను, సాక్షులను విచారించి అత్యాచారానికి పాల్పడిన నిందితుడు గండి చిన్నమ్మ నాయుడుకు 7ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు ఆయన తెలిపారు. 2016లో అత్యాచారం జరిగిందని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం జిల్లా బొందపల్లి గ్రామానికి చెందిన గండి చిన్నమ్మ ఘాతుకానికి పాల్పడినట్టు గుర్తించి కసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తు అధికారులు అప్పటి కాటారం డిఎస్పీ ప్రసాద్ విచారణ జరిపి నేరాభియోగ పత్రాలను కోర్టుకు దాఖలు చేశారని అన్నారు. దీనిపై సాక్షులను, బాధితులను విచారించిన సెషన్ జిల్లా కోర్టు న్యాయమూర్తి నారాయణ బాబు నిందుతుడు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి 7సంవత్సరాల జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్టు తెలిపారు. నేరాలకు పాల్పడితే చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్ఆర్‌టీపీ పరామర్శ

నవతెలంగాణ - ములుగు

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు నల్లెల్ల కుమారస్వామిని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. జిల్లా అధికార ప్రతినిధి మెట్టు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాదర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అన్న తిరుపతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల ప్రవీణ్, ములుగు మండల అధ్యక్షుడు కొండబోయిన దిలీప్, లెక్కల అమరేందర్ రెడ్డి, గూడపు కర్ణాకర్ రెడ్డి, పావురాల బిక్షపతి, ప్రశాంత్ గతంలో పాల్గొన్నారు.



'గిరి వికాస్' వికసించేనా ?

నవతెలంగాణ-వాజేడు

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా ఏజెన్సీలో గిరిపుత్రుల వ్యవసాయ అభివృద్ధికి నీటి వసతి లేని భూములకు నీరు అందించేందుకు బోర్ వెల్స్ మంజూరు చేసేందుకు 'గిరి వికాస్' పథకం తీసుకొచ్చారు. కానీ, నేడు ఏజెన్సీ మండలాల్లో గిరవికాస్ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలం అవుతోంది. గత మూడేండ్ల క్రితం వాజేడు, వెంకటాపురం మండలాల గిరిజన రైతుల పంట పొలాల్లో ఐటీడీఏ ద్వారా 'గిరి వికాస్' బోర్లు వేశారు. కొంతమంది రైతులకు మోటార్స్ కూడా అందజేశారు. కానీ, నేటికీ మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ విద్యుత్ లైన్ వేయలేదు. దీంతో చిన్న, సన్న కారు గిరిజన రైతుల పట్ల ప్రభుత్వం, అధికారులు ఎంత నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. విద్యుత్ లైన్ లేకపోవడంతో కొన్ని వందల ఎకరాలు బీడు భూములుగానే మిగిలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో ప్రత్యేక దృష్టి పెట్టి, బోర్లు వేసిన తమ భూముల్లో విద్యుత్తు లైన్లు కూడా వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.